VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

4 పేజీలు 7 నయాపైసలు రిజిష్టరు నెం. 203 A

విశాలాంధ్ర

706 27

సంపుటి 12 | విజయవాడ • 24 సెప్టెంబరు 1962 • సోమవారం [సంచిక 169

'విశాలాంధ్ర' పత్రిక

చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం ...	28.00 ...	30.00
ఆరు మాసాలు ...	14.00 ...	15.00
మూడు మాసాలు ...	7.00 ...	7.75
ఒక మాసం ...	2.40 ...	2.60

నైజీరియాలో నెహ్రూ

లాగోస్, సెప్టెంబరు 23

ప్రధాని నెహ్రూ నేడు పారిస్‌నుండి ఇక్కడికి వచ్చారు. ఆయన నైజీరియాలో మూడు రోజులపాటు వుంటారు. శ్రీ నెహ్రూను నైజీరియా ప్రధానమంత్రి తఫీవాబలేవా విమానాశ్రయంలో స్వాగత మిచ్చారు.

సిసలైన ప్రజాస్వామ్యానికి సోషలిస్టు దేశాలే ఉనికిపట్టులు

ఢిల్లీ రాజకీయశాస్త్ర గోష్ఠిలో కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ నంబూద్రిపాద్ ఉద్ఘాటన

బలప్రయోగసాధనాలు ఏవర్గంచేతుల్లోవుంటే దనిదేసార్వభౌమాధికారమౌతుందనివివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 23

సిసలైన ప్రజాస్వామ్యం సోషలిస్టు దేశాలలోనేఉన్నదికాని పెట్టుబడిదారీ దేశాలలో లేదని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఇ. యం. యస్. నంబూద్రిపాద్ మొన్న ఇక్కడ ఒక గోష్టిలో ప్రసంగిస్తూ ఉద్ఘాటించారు.

భారత దేశాన్ని ఉదహరిస్తూ, ఇక్కడ రాజ్యాంగాన్ని రూపొందించిన దోపిడీదార్లవర్గం ఆస్తిహక్కును చట్టబద్ధం చేసిందేగాని ఉద్యోగహక్కును చట్టబద్ధంచేయలేదని పేర్కొన్నారు.

ఇక్కడున్న హిందూ కాలేజీ వారు ఏర్పరచిన రాజకీయశాస్త్ర గోష్టిలో "సామ్యవాదం, ప్రజాస్వామ్యం, నియంతృత్వం" అన్న విషయంపై ప్రసంగిస్తూ ఆయనిలా అన్నారు:

"ప్రజాస్వామ్య దేశాలని చెప్పబడుతున్న దేశాలలో సార్వభౌమాధికారం ప్రజలకు ఉంటుందనుకోవడం పొరపాటు. బలప్రయోగ సాధనాలు ఎవరి చేతుల్లో ఉంటాయో వారికే సార్వభౌమాధికారం కూడ వుంటూవుంటుంది.

ఉదాహరణకు ఇటీవలపాకిస్తానులో వచ్చిన మార్పులను తీసుకొందాం. తూర్పుబెంగాల్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కేంద్రంలోని ముస్లింలీగ్ ప్రభుత్వం బర్తరఫ్ చేసింది. ఈ ముస్లింలీగ్ ప్రభుత్వాన్ని అప్పటి అధ్యక్షుడు (ఇస్కందర్‌మీర్జా) బర్తరఫ్ చేశాడు. ఈ అధ్యక్షుడ్ని సాయుధ బలగాలు పదవీచ్యుతుణ్ణి చేసి అధికారాన్ని చేజిక్కించుకొన్నాయి. ఈ మార్పులన్నింటా సార్వభౌమాధికారులుగా చెప్పబడే ప్రజలపాత్ర ఎక్కడా కానరాదు.

ఆలాగే భారతదేశంలోకూడ సార్వభౌమాధికారం, హక్కులూ ప్రజాపరంగాలేవు. మైనారిటీగా ఉన్న దోపిడీదార్లవర్గానికే ఇవి చెందుతాయి. అధికారానికి చిహ్నమైన రాజ్యాంగాన్ని ఈ దోపిడీదార్లవర్గమే రూపొందించింది. అందుచేతనే ఆస్తిహక్కు న్యాయస్థానాల రక్షణ ఏర్పడింది. ఉద్యోగ హక్కుమాత్రం గుర్తింపబడలేదు.

అత్యధిక సంఖ్యాకుల స్వేచ్ఛను హరించివేసే దోపిడీదార్ల మైనారిటీకి కార్మికవర్గ నియంతృత్వం వ్యతిరేకం. ప్రజాబాహుళ్యానికి నిజమైన ప్రజాస్వామ్యం కార్మికవర్గ నియంతృత్వం క్రిందనే సిద్ధిస్తుంది. అందుచేత కార్మికవర్గ నియంతృత్వం, ప్రజాస్వామ్యం పరస్పర విరుద్ధమైనవి కావు.

సోషలిస్టు న్యాయపద్ధతిని, పార్టీ అంతర్గత స్వేచ్ఛను స్టాలిన్ ఉల్లంఘించినమాట నిజమే. ఈ ఉల్లంఘన తాత్కాలికంగా మార్గం తప్పడమే కాని శాశ్వతపద్ధతి కాదు. మొత్తంమీదచూస్తే సోవియట్ యూనియన్‌లో ఫ్యాక్టరీలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇతర సోవియట్లు (స్థానిక స్వపరిపాలన సంస్థలు) రాష్ట్ర, కేంద్ర శాసనసభలకు కార్మికులను పంపినంత ఎక్కువ సంఖ్యలో భారతదేశంతోసహా ఏ పెట్టుబడిదారీ దేశమూ పంపలేదు. సోవియట్ యూనియన్‌లోని సోవియట్లను, భూస్వాములు, ఇతర దోపిడీదార్లులేని నిజమైన పంచాయతీలుగా పేర్కొనవచ్చును.

అంతర్జాతీయకమ్యూనిజం వ్యాప్తిపై వచ్చిన ఒక ప్రశ్నకు జవాబిస్తూ నంబూద్రిపాద్ ఇలా అన్నారు:

"కమ్యూనిజం ఎగుమతి చేయబడే వస్తువు కాదు. సహజీవనంలో అంతర్జాతీయ కమ్యూనిజానికి నమ్మకం ఉంది. కాని ప్రతిఘాత విప్లవాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయడాన్ని అది వ్యతిరేకిస్తుంది.

తమకు ఏరకమైన ప్రభుత్వం కావాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను అన్ని దేశాలకు ఇస్తే అవి అంతర్గత సాంఘిక ఆర్థిక పరిస్థితుల కారణంగా ఒకానొక రోజున సోషలిజాన్ని చేపట్టడం అనివార్యం. బయటనుండి సోషలిజం మార్గాన్ని రుద్దవలసిన అవసరంలేదు"అని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

ఈశాన్య సరిహద్దులో తుపాకి కాల్పులు

భారత విదేశాంగశాఖ ప్రతినిధి ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో ఒక చౌకీని కాపలా కాస్తున్న భారత సైనికులకు, చైనా సైనికులకు మధ్య నిన్నకూడ అడపాతడపా తుపాకి కాల్పులు జరిగాయని భారత విదేశాంగ వ్యవహారాలశాఖ ప్రతినిధి ఒకరు నేడిక్కడ చెప్పారు.

20వ తేదీ రాత్రివేళ యీ చౌకీ మీద చైనా సైనికులు దాడి చేశారనీ, ఆ రాత్రి అంతా అడపా తడపా కాల్పులు సాగించారనీ అన్నారు.

ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో తాజా పరిణామాలను గురించి చెబుతూ నిన్నటి ఉదయం నుండి రెండు పక్షాల మధ్య "అడపా తడపా కాల్పులు సాగుతూనే వున్నాయి" అనిఅన్నారు.

భారత-టిబెట్టు సరిహద్దులో "థాగ్ లా" కొండకు రెండు మైళ్ళ దూరంలోవున్న ధోలా చౌకీకంటె చైనా సైనికులదాడికి గురైన చౌకీ ఇంకా దూరాన కలదన్న వార్తలను యీ ప్రతినిధి ఖండించారు. ఈ చౌకీ ప్రధానమైన ధోలా చౌకీకి ఉపాంగమనీ, థాగ్ లా కొండనుండి ధోలా చౌకీ ఎంత దూరానవున్నదో ఇదికూడా ఇంచుమించు అంతే దూరాన వున్నదనీ ఆయన చెప్పారు.

గత వారం ఒక చౌకీకి సమీపాన చైనా సైనికులు కనిపించిన చోటే ఇప్పుడు చైనా సైనికులు దాడి చేసిన చోటు అన్న వార్తలను కూడా ఖండించారు.

థాగ్ లా కొండను భారత సైనికులు దాటనే లేదనీ, చైనా సైనికులు తాము దాడి జరిపిన చోటుని గురించి కావాలని గందరగోళపరుస్తున్నారనీ ఈయన అన్నారు.

ప్రధానమైన ధోలా చౌకీ వున్న స్థలాన్ని స్థానికంగా "త్సె డాంగ్" అని పిలుస్తారనీ, థాగ్ లా కొండకు ఉత్తరాన "లే" అనే గ్రామమున్నదనీ, ఇది టిబెట్ లోనిదనీ అన్నారు. ఏదో ఒక గ్రామాన్ని చైనీయులు చెడాంగ్ అనో, చెడాంగ్ లీ అనో పిలుస్తూ అనవసర గందరగోళం కల్పిస్తున్నారని అన్నారు. భారత ప్రభుత్వానికి తెలిసినంతవరకు ఆ పేరుగల గ్రామం లేదని అన్నారు.

భారత సైనికులు కవ్వించారన్న ఆరోపణ నిరాకరణ

భారతప్రతినిధి ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

లడక్‌లో పాంగాంగ్ సరస్సు ప్రాంతంలో సెప్టెంబరు 19వ తేదీన భారత సైనికులు కవ్వింపు చర్యలు జరిపారని చైనా వార్తా సంస్థ చేసిన ప్రకటన నిజంకాదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు నేడిక్కడ తెలియజేశారు.

పాంగాంగ్ సరస్సు ప్రాంతంలో వున్న రెండు భారతీయ చౌకీల మధ్య రాకపోకలలో జోక్యం కలుగజేసుకోవాలని చైనావారు ప్రయత్నించారనీ కాని భారత సైనికులు వారిని నిరోధించారనీ, చైనా సైనికులు కవ్వించినా కాల్పులు జరపలేదని అన్నారు. ఆ తర్వాత ఆ ప్రాంతం నుండి చైనీయులు వెళ్ళిపోయారని చెప్పారు.

చైనా వార్తాసంస్థ తెలిపిన సమాచారం ప్రకారం మామూలుగ గస్తీవిధులు నిర్వహిస్తున్న ఆరుగురు చైనా సైనికులు, 80 మందికి పైగా వున్న భారతీయ సైనికులు రెండు ముఠాలుగా చీలివచ్చినప్పుడు "హఠాత్తుగా తీవ్రమైన కవ్వింపు చర్యలకు" గురి అయ్యారని తెలిపింది.

"చైనా గస్తీదళంమీదికి భారత సైనికులు చుట్టుముట్టివచ్చి, మీదిమీదికి ప్రమాదకరంగా సాగివచ్చారు. ఒక సందర్భంలో చైనా గస్తీదళానికి 30 మీటర్ల (సుమారు 33 గజాల) దూరంలోకి భారత సైనికుల దళం సాగివచ్చింది" అని ఆ వార్తాసంస్థ ప్రకటించింది.

రష్యాతో వర్తకానికి తాయ్‌లాండ్ నిర్ణయం

బాంకాక్, సెప్టెంబరు 22

సోవియట్‌తో వర్తకఒడంబడిక సంప్రతింపులను జరిపేందుకు తాయ్‌లాండ్ ప్రభుత్వం నిశ్చయించుకున్నదని తాయ్‌లాండ్ దేశీయ వ్యవహారాల మంత్రి జనరల్ ప్రపాస్ చారుసాతీన్ పత్రికలవారికి తెలియజేశారు.

అయితే తామీ నిర్ణయాన్ని అమెరికాపై ప్రతీకారచర్యగా ఉద్దేశించలేదని ఆయన అన్నారు.

కాంబోడియాకు ఆయుధాల సప్లయిని అమెరికా పెంచిందని తాయ్‌లాండ్ ప్రభుత్వం అంటూంది. ప్రస్తుతం తాయ్‌లాండ్, కాంబోడియా దేశాల మధ్య సరిహద్దు తగాదా ఒకటి ఉంది.

సోవియట్‌తో వర్తక ఒడంబడిక చేసుకోడానికి తాము నిశ్చయించుకున్నప్పటికీ, కమ్యూనిజానికి తమ ప్రతిఘటనను ఏమాత్రమూ తగ్గించుకోము అని జనరల్ ప్రపాస్ అన్నారు.

తమ ప్రభుత్వం అనుసరిస్తున్నది పశ్చిమ దేశాల అనుకూల విధానమూ కాదు, కమ్యూనిస్టు దేశాల అనుకూలవిధానమూ కాదు. తటస్థ విధానమూ కాదనీ, ఇది "తాయిస్టు" విధానమనీ ఈయన ఇటీవల ఒక పత్రికాగోష్టిలో పేర్కొన్నారు.

భారతీయ సైనికులు తిరిగి కాల్పులు సాగించారని చైనా

నవచైనా వార్తాసంస్థ ప్రకటన

పెకింగ్, సెప్టెంబర్ 22

భారతీయ సైనికులు మళ్ళీ కాల్పులు సాగించారని, తమ ప్రాంతాలలోనికి చొచ్చుకొని వచ్చారని చైనా నేడు తిరిగి ఆరోపణ చేసింది.

"సెప్టెంబరు 21వ తేదీ రాత్రి 9-30 గం. నుండి 11 గంటలవరకు భారతీయ సైనికులు ఛెజోవ్ (బ్రిడ్జికి పడమర కాపలా కాస్తున్న చైనా రక్షణ దళాలపై తీవ్రంగా దాడి చేశారు"ని నవచైనా వార్తాసంస్థ తెలియచేసింది. అందులో ఇంకా ఇలావుంది:

ఛెదోంగు, (దానిని భారతీయులు ధోలా అని పిలుస్తుంటారు) టిబెట్-భారతదేశం సరిహద్దు మీద తూర్పు దిశన వున్నది.

భారతీయులు 400 గుండ్లు కాల్చారనీ, రెండు చేతి బాంబులు విసిరారని తప్పనిసరియై చైనావారు ఆత్మరక్షణ నిమిత్తం తిరిగి కాల్పులు సాగించవలసి వచ్చిందని నవచైనా వార్తాసంస్థ అంటున్నది.

"ఆ రోజంతా చొచ్చుకొని వస్తున్న భారతీయ సైనికులు 21వ తేదీ అంతా మధ్యమధ్య కాల్పులు సాగించుతూనే వున్నారు.

"పై వాస్తవాల దృష్ట్యా చూచినట్లయితే ఛెదోంగు ప్రాంతంలో పరిస్థితులు యింకా దిగజారేలాగా వున్నాయి.

చైనా అధికారులు పరిస్థితులను చాల జాగ్రత్తగా పరిశీలించుతున్నారు" అని ఆ వార్తాసంస్థ అన్నది.

ఈ ప్రాంతంలో కాల్పులు జరిగి ఒక చైనా అధికారి మరణించడం, ఒక సైనికుడు గాయపడడం పట్ల చైనా ప్రభుత్వం భారతప్రభుత్వానికి తీవ్రాతితీవ్రమయిన నిరసన తెలియజేసిందని పెకింగు పత్రికలు నేడు వ్రాశాయి.

చెదోంగు ప్రాంతాన్ని భారతదేశం వెంటనే వదిలిపెట్టి పోవాలని చైనా నిరసనపత్రం కోరింది.

నిన్న ఇక్కడ విడుదల అయిన మరొక పత్రంలో ఎట్టిషరతులు లేకుండా వెంటనే తిరిగి సంప్రదింపులు ప్రారంభించవలసినదిగా చైనా కోరింది. ప్రస్తుతంవున్న స్థావరాల నుండి 12 మైళ్ళ వెనకకు యిరుపక్షాల సైనికులు తగ్గాలనికూడా పత్రం సూచించింది.

గత వారంరోజులుగా భారతీయులు మాక్‌మోహన్ రేఖను దాటివచ్చి రెచ్చగొట్టే చర్యలు సాగించుతున్నారని చైనా ప్రభుత్వం తెలియజేస్తున్నది. చైనావారే దాటివస్తున్నారనే భారతదేశ ఆరోపణను వారు నిరాకరిస్తున్నారు.

భారత్‌కు చైనా తీవ్ర నిరసన

తాజాగా జరిగిన సరిహద్దు ఘటనపై

పెకింగ్, సెప్టెంబరు 22

సరిహద్దులో తాజాగా జరిగిన సంఘర్షణను గురించి చైనాప్రభుత్వం భారతప్రభుత్వానికి తన "అత్యంత తీవ్రమైన నిరసనను" తెలియజేసినట్లు నేడు పెకింగ్ పత్రికలు ప్రకటించాయి.

సంఘర్షణ జరిగినచెదోంగ్ ప్రాంతం నుండీ, చే-జో బ్రిడ్జినుండీ ఇండియా వెంటనే వైదొలగాలనీ, అలా జరగని పక్షంలో ఆత్మసంరక్షణ కోసం చైనా సైనికులు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకొనవలసి వస్తుందని చైనా ప్రభుత్వం తన నిరసన పత్రంలో పేర్కొన్నది.

ఈ ఘర్షణ సందర్భంలో ఒక చైనా ఆఫీసరు చనిపోయాడు. మరొక సైనికుడు గాయపడ్డాడు. ఇందుకు క్షమాపణను డిమాండ్ చేసే హక్కును, పరిహారాన్ని కోరే హక్కును చైనా రిజర్వు చేసుకొన్నదని కూడా ఆపత్రంలో వ్రాశారు.

[ఈ సంఘర్షణ విషయంలో నే భారత ప్రభుత్వం కూడా ఒక నిరసన పత్రాన్ని, పెకింగ్‌కు పంపించినట్లు నిన్న న్యూఢిల్లీలో భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు తెలియజేశారు.]

చైనావారు నిన్న యిక్కడ విడుదల చేసిన ప్రకటనలో ఇంకా యిలా వుంది:

సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితిని సడలించుతున్నట్లు నటించుతూనే భారతదేశం దురాక్రమణ కార్యకలాపాలను సాగించుతున్నది. ఆ ప్రాంతంలో చైనా భూభాగంలోకి భారతీయ సైనికులు వచ్చి కవ్వింపు చర్యలను కొనసాగించుతున్నారు.

కమ్యూనిజంపట్ల వినోబాకు గౌరవం

అయితే ప్రేమతో సమాజాన్నీ వ్యక్తినీ మార్చాలని ఆయన ఆకాంక్ష

దాలింగావ్, సెప్టెంబరు 22

కమ్యూనిజంలో ఇమిడివున్న సూత్రంపట్లకు తనకు మహాగౌరవమున్నదని ఆచార్య వినోభా భావే నేడిక్కడ అన్నారు.

అయితే మనం త్రికరణశుద్ధిగా దారిద్ర్యమనే సమస్యను పరిష్కరించక పోయినట్లయితే, కమ్యూనిజం అని పిలువబడే పిడివాదంలో పడికొట్టుకుపోకుండా, కమ్యూనిజం బోధించే మంచినంతా వుపయోగించుకొనేందుకు అనువైన వాతావరణం సృష్టించలేము" అని ఆచార్యభావే అన్నారు.

విలేఖరులు అడిగిన ప్రశ్నకుఆచార్య భావే పైవిధంగా సమాధానమిచ్చారు.

బెంగాలు రిలీఫ్‌మంత్రితో కలసి ఆచార్యభావే నేడిక్కడికి వచ్చారు.

కమ్యూనిజం మతానికి వ్యతిరేకమైనది. కాబటి కమ్యూనిజాన్ని మీరు వ్యతిరేకిస్తున్నారా అని విలేఖరులు ప్రశ్నించగా శ్రీ భావే ఇలాఅన్నారు.

"కమ్యూనిజంపై నా అభిప్రాయాలను నాలుగుముక్కలలో చెప్పడంకష్టం. మన పిడివాదంతో దీన్ని పరిశీలించరాదు. మానవత దృష్టితో పరిశీలించాలి. కమ్యూనిస్టు దృక్పథం అంతర్జాతీయ దృక్పథం. అది దానిలోగల సుగుణం. అయితే ఈ దృక్పథం మూలంగా ప్రపంచం రెండుగా చీలిపోయింది. దీనిలోని ప్రధాన లోపమిదే. వ్యక్తినీ, సమాజాన్నీ, ప్రేమ, కరుణలతో మార్చగలిగితే మనకృషి ఫలించినట్లవుతుం"దని శ్రీ వినోభా భావే అన్నారు.

మతాలు ప్రజలను ఐక్యపరచడానికి మారు వారిలో చీలికలు తెస్తున్నందువల్ల మతాలపట్ల తనకూ పెద్ద ఆసక్తి లేదని అన్నారు.

"చైనాతోటి సరిహద్దు భారతదేశానికి పెద్ద విదేశాంగ సమస్య"

పారిస్‌లో శ్రీ నెహ్రూప్రకటన

పారిస్, సెప్టెంబరు 22

చైనాతోటి సరిహద్దుసమస్య భారతదేశానికొక పెద్ద విదేశాంగసమస్యఅని నేడిక్కడ ప్రధాని నెహ్రూ చెప్పారు.

మూడురోజులు పారిస్‌లో గడిపి వెళ్ళేముందు ఒక పత్రికాగోష్టిలో ప్రశ్నలకు సమాధానమిస్తూ చైనాతో తన సరిహద్దుసమస్యను శాంతియుతంగానే పరిష్కరించుకోవాలని భారతదేశం వాంఛిస్తున్నదనీ, అయితే "ఇలా చొచ్చుకువచ్చే చర్యలను మేము సహించం; మా సరిహద్దులను రక్షించుకోవాలి" అని చెప్పారు.

వచ్చే నెలలో యీ సరిహద్దు సమస్య మీద చైనాతో సంభాషణలు ఆరంభించడానికి కొన్ని షరతులతో భారతదేశం అంగీకరించింది.

"ఇటీవల వచ్చిన వార్తలనుబట్టి చైనా సైనికులు సరిహద్దుదాటి 200 గజాలు వచ్చారని తెలిసింది. అసలు దాటిరావడం అనేది జరిగింది; ఆ తర్వాత కొన్ని స్వల్పమైన ఘర్షణలు కూడ మా గస్తీదళాలకూ వారి గస్తీదళాలకూ మధ్య జరిగాయి. అక్కడ వారికేమీ పనిలేదని మేము అంటాం. ఆ ప్రాంతం తమదని వారంటారు - ఇది తప్పని మేము భావిస్తున్నాం.

"ఇలా సరిహద్దుమీద చొచ్చుకురావడాన్ని సహించం; ఏమయినా వీలుంటే దీనిని శాంతియుతంగా పరిష్కరించుకోవాలనే కోరుతున్నాం; అయితే మా సరిహద్దును రక్షించుకుతీరాలి" అని శ్రీ నెహ్రూ చెప్పారు.

నెహ్రూ ఆహ్వానానికి డీగోల్ ఆమోదం

భారత దేశానికి రావలసిందిగా ఫ్రెంచి అధ్యక్షుడు డీగోల్‌నూ, ఆయన భార్యనూ ఆహ్వానించామని ప్రధాని నెహ్రూ నేడిక్కడచెప్పారు. ఈ ఆహ్వానాన్ని ఆమోదించడానికి చాలా సంతసిస్తున్నాననీ, అయితే భారతదేశానికి ఎప్పుడు రాగలిగేదీ చెప్పలేననీ డీగోల్ అన్నారు.

సింగపూర్ ప్రధాని లీకువాన్‌యూ లండన్‌నుండి స్వదేశానికి వెళుతూ శనివారం ఢిల్లీ వచ్చారు.

రష్యన్ భాషలో కిషన్ చందర్ నవల ప్రచురణ

మాస్కో, సెప్టెంబరు 22

"ఒక అమ్మాయి - వేయిమంది ఆరాధకులు" అని ప్రఖ్యాత భారతీయ రచయిత కిషన్‌చందర్ ఉర్దూలో రాసిన నవల రష్యన్ అనువాదాన్ని సోవియట్‌లో ప్రచురించారని 'టాస్' వార్తా సంస్థ తెలిపింది. కిషన్‌చందర్ రాసిన "పరాజయం" అన్న మరొక నవలనూ, అతని కథానికలు కొన్నిటినీ, రష్యన్ భాషలోకి అనువదించి ఇదివరకే ప్రచురించారు.

బొంబాయి జౌళి కార్మికుల బోనస్ తగాదాపై చావన్ మధ్యవర్తిత్వం:

యజమాన్లు, ఐ.ఎన్.టి.యు.సి. వారి మధ్య ఒప్పందం

బొంబాయి, సెప్టెంబరు 22

బొంబాయిలోని రెండు లక్షల జౌళి కార్మికులకు 1959, 60, 61 సంవత్సరాలకు బోనస్ చెల్లించే విషయమై వచ్చిన వివాదంలో తీర్పు చెప్పవలసిందిగా యజమానులు, రాష్ట్రీయ మిల్లు మజ్దూర్ సభ (మహారాష్ట్ర) ముఖ్యమంత్రి శ్రీ చావన్‌ను కోరారు. అందుకు ఆయన అంగీకరించారు.

బోనస్ చెల్లింపుకై యజమానులు తగు చర్యలు తీసుకోనందువల్ల సెప్టెంబరు 24న లాంఛనంగా సమ్మె చేయాలని ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధింప బడిన గిర్ని కాంగార్ యూనియన్ నిశ్చయించిన విషయం పాఠకులకు విదితమే.

సమస్యను మధ్యవర్తిత్వకు వదలిపెట్టడానికి నిన్నటివరకు మిల్లు యజమానులు నిరాకరిస్తూ వచ్చారు.

ఇప్పుడు, ఐ.యన్.టి.యుసికి అనుబంధింపబడిన రాష్ట్రీయ మిల్లు మజ్దూర్ సభ, మిల్లు యజమానులు తన మధ్యవర్తిత్వానికి అంగీకరించినట్లు శ్రీ చావన్ ప్రకటించారు.

సెప్టెంబరు 24న సమ్మెచేయవలసిందిగా గిర్ని కాంగార్ యూనియన్ కార్మికులకు పిలుపు ఇచ్చినందువల్ల ఆనాడు బొంబాయిలోఎవరూలాఠీలు కర్రలు, మారణాయుధాలు ధరించకూడదని పోలీసు కమిషనర్ నేడు ఉత్తర్వు జారీచేశారు.

శ్రీ ముండస్సెరికి కేరళ సాహిత్య అకాడమీ సన్మానం

షష్ఠి పూర్త్యుత్సవసందర్భంలో

త్రిచూరు, సెప్టెంబరు 22

కేరళ కమ్యూనిస్టు మంత్రివర్గ హయాములో విద్యామంత్రీ, ప్రముఖ సాహిత్య విమర్శకుడూ అయిన జోసఫ్ ముండస్సెరీ షష్టిపూర్తి సందర్భంలో కేరళ సాహిత్య అకాడమీ ఆయన్ను సన్మానించింది.

సన్మానసభకు అధ్యక్షత వహించిన శ్రీ యన్. గోపాలపిళ్లే సంప్రదాయానుసారం "పున్నడై"నీ, సువర్ణాంగుళీయాన్నీ బహూకరించారు.

అకాడమీవారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మళయాళభాషలో 'వచన సాహిత్యాభివృద్ధి'పై చర్చను ఏర్పాటుచేశారు. శ్రీ ముండస్సెరీతో సహా కేరళలోని ప్రముఖ రచయితలు ఈ విషయంపై తమ వ్యాసాలు చదివి వినిపించారు.

కెన్నెడీ స్వాతిశయం

కొలంబస్, సెప్టెంబరు 22

"కరిబియన్ సముద్రరంగం (క్యూబా ఉన్న ప్రాంతం)లోగాని, బెర్లిన్‌లోగాని, మరెక్కడైనాగాని, దురాక్రమణను ఎదుర్కోడానికి అమెరికా సిద్ధంగా ఉన్నద"ని, అమెరికా అధ్యక్షుడు నేడొక ప్రసంగంలో అన్నారు. ఓహియో రాష్ట్రంలోని కొలంబస్ నగరంలో జరుగుతూన్న డెమోక్రటిక్ పార్టీ సమావేశానికి కెన్నెడీ ఈ ప్రసంగాన్ని టెలిఫోన్ ద్వారా అందజేశారు.

తాను అధికారంలోకి వచ్చిన ఈ ఇరవై మాసాల్లోనూ కమ్యూనిజం వెనకడుగు వేసిందని, కెన్నెడీ అన్నారు.

1961 జనవరిలో తన ప్రభుత్వం ఏర్పడిననాడు 'బెర్లిన్‌రంగంలో' క్రుశ్చేవ్ మంచి జోరుమీద ఉన్నారు. కాంగోలో గిజెంగా, లావోస్, దక్షిణ వియత్నాములలో కమ్యూనిస్టులు విజృంభిస్తున్నారనీ, తాను అధికారంలోకి వచ్చినతరువాత వీరంతా తగ్గారనీ కెన్నెడీ అన్నారు.

జాతీయ ఐక్య సంఘటనకై పాకిస్తాన్‌లో కృషి

ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని సాధించే లక్ష్యంతో

కరాచీ, సెప్టెంబరు 22

పాకిస్తాన్‌లో పూర్తిగా ప్రజాతంత్రయుతమయిన రాజ్యాంగచట్టాన్ని సాధించేందుకై విశాల ప్రాతిపదికగల ఒక జాతీయ ఐక్యసంఘటనను నిర్మించాలని పాక్ మాజీ ప్రధానులలో ఒకరయిన హెచ్. యస్. సుహ్రావర్దీ చేసిన ప్రతిపాదనకు, ఇక్కడ జరిగిన ఒక సమావేశంలో అత్యధిక ఆమోదం లభించింది.

సింధు, బెలూచిస్థాన్, కరాచీ ప్రాంతాలకు చెందిన రాజకీయ ప్రముఖులు ఇక్కడ ఇష్టాగోష్ఠిగా సమావేశమయి, ఈ విషయం గురించి చర్చించారు. సుహ్రావర్దీ, తూర్పు పాకిస్తాన్‌కి చెందిన మరికొందరు నాయకులూ కలిసి చేసిన ఈ ప్రతిపాదనను, ఈ సమావేశంలో మరొక ఇద్దరు మాజీప్రధానులతోసహా ముప్పైమంది పూర్తిగా బలపరిచారని వెల్లడయింది.

ఇప్పుడు ఒకే రాష్ట్రంగా ఉన్న పశ్చిమ పాకిస్తాన్‌ని మునుపటి సింధు, బెలూచిస్థాన్, పశ్చిమ పంజాబ్ మొదలయిన రాష్ట్రాలుగా పునర్విభజించేందుకూ, రాజధానిని తిరిగి కరాచీకి మార్చేందుకూ కూడా, ఈ జాతీయ ఐక్యసంఘటన కృషి చేయాలని ఆయా ప్రాంతాలవారు సూచించారు. ప్రజాతంత్ర రాజ్యాంగచట్టాన్ని సాధించడం ప్రప్రథమమనీ, ఆ కర్తవ్యం నెరవేరినతర్వాత ఈ విషయాలను గురించి ఆలోచించవచ్చుననీ, సుహ్రావర్దీ అన్నారని తెలుస్తోంది.

ఉత్తరాది ప్రాంతాలవారితో కూడా ఇలాంటి సమావేశం జరిపేందుకు సుహ్రావర్దీ, తదితర తూర్పు పాకిస్తాన్ నాయకులు లాహోర్ వెళ్ళారు.

కరాచీ సమావేశంలో పాల్గొనేందుకు సుహ్రావర్దీతోపాటు అదే విమానంలో వచ్చిన బెలూచిస్థాన్ ఆవామీలీగ్ నాయకుడు ఘాస్‌బక్స్ బిజెంగోని విమానాశ్రయంలో అరెస్టు చేశారు.

మునుపటి ముస్లింలీగ్ కౌన్సిల్‌ని తిరిగి సమావేశపరచేందుకు సర్దార్ బహదూర్ ఖాన్ మొదలయినవారు కొందరు ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థుల ఆందోళన

ఈ నెల పదిహేడవ తేదీని ఢాకాలో విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరిపినందుకు నిరసనగా కరాచీ, సుక్కూర్, సింధు రాష్ట్రంలోని హైదరాబాద్, మొదలయిన చోట్ల విద్యార్థులు పెద్ద పెద్ద ప్రదర్శనలు చేశారు.

లండన్‌లోని పాకిస్తాన్ విద్యార్థులు ఒక నిరసన సభ జరిపారు.

యుద్ధ తంత్రంపై రష్యాలో కొత్త గ్రంథం

మాస్కో, సెప్టెంబరు 22

సోవియట్ యుద్ధతంత్రంగురించిన కొత్త అధికార గ్రంథం సమీక్షను, సోవియట్ రక్షణశాఖ పత్రిక నేడు ప్రచురించింది.

మరొక ప్రపంచ యుద్ధమేగనుక వస్తే విశ్వాంతరాళాన్ని కూడా సోవియట్ తన రక్షణకోసం వినియోగించుకుంటుందని ఈ గ్రంథంలో స్పష్టం చేశారు.

తనపైని ఎవరైనా దాడిచేస్తే సోవియట్ దేశం తన రాకెట్ ఆయుధాలలో, దురాక్రమణ దేశాల ప్రభుత్వ, సైనిక ప్రధాన కార్యాలయాలున్న కేంద్ర స్థానాలపైనే దెబ్బతీస్తుందని కూడా ఈ గ్రంథం తెలుపుతూంది.

కొంతమంది ఉన్నత సైనికాధికారులు కలిసిరాసిన ఈ గ్రంథాన్ని సోవియట్ రక్షణశాఖ పత్రిక 'రెడ్ స్టార్'లో జనరల్ పి.పి. కారోచ్కిన్ సమీక్షించారు.

దురాక్రమణదారులకు అతి త్వర పీడించగల ప్రధాన సాధనం హైడ్రొజన్ బాంబును అమర్చిన రాకెట్ ఆయుధాలని, ఈ గ్రంథంలో నిర్ధారణ చేశారని సమీక్షకుడు తెలిపాడు.

ఒకవేళ మరో ప్రపంచయుద్ధం వస్తే అది ఎటువంటిదిగా ఉంటుందో ఈ గ్రంథంలో ఈ విధంగా సూచించారు:

అది అందరినీ చుట్టబెట్టేదిగా ఉంటుంది. మామూలు ఆయుధాలనూ, అణ్వాయుధాలనూ కూడా ఉపయోగిస్తారు. భూమిమీదే కాకుండా రోదసిలో కూడా ఆ యుద్ధం సాగుతుంది.

పరస్పర వ్యతిరేకాలయిన రెండు సామాజిక, రాజకీయ వ్యవస్థల మధ్య సాగే సిద్ధాంత, సైనిక పోరాటంగా అది ఉంటుంది.

అది మెరుపు యుద్ధంగా ఉంటుంది. ఆ యుద్ధం ఫలితం ఏమయేదీ, అది ప్రారంభమయిన కొద్ది నిముషాల్లోనే, లేదా కొద్దిగంటల్లోనే తేలిపోతుంది, అని ఈ గ్రంథం వివరించింది.

ఇది 458 పేజీల గ్రంథమనీ, సోవియట్ సైనికాధికారవర్గానికై ఉన్నత సైనికాధికారులకు తర్ఫీదు నిచ్చే ఫ్రుంజ్ సైనిక శిక్షణాలయం ఆధ్వర్యాన దీని రచన సాగిందనీ ఈసమీక్షకుడు తెలిపాడు.

బొగ్గు రవాణా సౌలభ్యంకోసం నాగపూర్ నుండి ఉమ్రేడ్‌కు ఒక బ్రాడ్‌గేజ్ రైల్వేలైనును నిర్మించడానికి రైల్వేబోర్డు అంగీకరించింది.

సరిహద్దుపై చర్చలకు చైనా ప్రతిపాదన

పెకింగ్‌లో ఉభయపక్షాల ప్రతినిధులు కలవాలని సూచించిన లేఖ పూర్తిపాఠం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21

"చైనా, ఇండియాల వంటి రెండు పెద్ద ఆసియా దేశాలమధ్య దీర్ఘ కాలం పాటు సరిహద్దు ఉద్రిక్తత కొనసాగడం ఏమాత్రం మంచిదికాదని చైనా భావిస్తున్నది. సరిహద్దు ఉద్రిక్తతను సడలించాలన్న తలంపుతో ఉభయపక్షాలూ కూడ సరిహద్దు పొడవునా 20 కిలోమీటర్ల దూరానికి తమ తమ సైనిక బలగాలను ఉపసంహరించాలని చైనా ప్రభుత్వం మరోసారి ప్రతిపాదిస్తున్నది" అని భారత ప్రభుత్వం గత ఆగస్టు 22 వ తేదీన పంపిన రెండు పత్రాలకు సమాధానంగా సెప్టెంబరు 13 వ తేదీన చైనా పంపిన పత్రంలో తెలియజేశారు.

ఈ సరిహద్దు వివాదం గురించి చర్చలు సాగించడానికి ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులు పెకింగ్ నగరంలో అక్టోబరు 15వ తేదీన సమావేశం కావాలనీ, తర్వాత ఢిల్లీలో యీ చర్చలు కొనసాగించాలనీ ఆ పత్రంలో చైనా ప్రభుత్వం తెలియపరచింది.

చైనా ప్రభుత్వం పంపిన పత్రం పూర్తిపాఠం ఇలా వుంది:

"ఉభయదేశాల అధికారులతయారు చేసిన నివేదిక ఆధారంగా వీలైనంత త్వరలో సరిహద్దు సమస్యను గురించి ఇంకా చర్చించడానికి భారతప్రభుత్వం తాను పంపిన పత్రాలలో నిరాకరించినందుకు చైనా ప్రభుత్వం విచారిస్తున్నది.

చైనా-భారత సరిహద్దులో పశ్చిమ రంగంలో చైనా దురాక్రమణ చర్యలు జరిపినదంటూ భారత ప్రభుత్వం తన పత్రాలలో కావాలనే చైనామీద నిందలు మోపింది. చైనాతో యీ సరిహద్దు సమస్యను చర్చించేందుకు నిరాకరించడానికి ఒక సాకును కనిపెట్టడంకోసమే భారత ప్రభుత్వం తాను పంపిన పత్రంలో "యీ ప్రాంతంలో 1957 నుండి బలప్రయోగంతో మార్పిడిచేసిన యథాతథస్థితిని పునరుద్ధరించితేనేతప్ప, ఇప్పటి ఉద్రిక్తతలను తొలగించితేనేతప్ప చర్చలు ఆరంభం కావు" అని పట్టుపట్టింది.

సంప్రతింపులద్వారా సరిహద్దు సమస్యను పరిష్కరించు "కొంటేవరకూ ఉభయపక్షాలూ సరిహద్దుపై యథాతథస్థితిని నిలబెట్టాలనీ, ఏ పక్షం చర్యలతో దానిని మార్చరాదని చైనా ప్రభుత్వం ఎల్లపుడూ చెబుతూ వస్తుంది. ఈ వైఖరికి చైనాప్రభుత్వం ఏప్పుడూ ఖచ్చితంగా కట్టుబడేవున్నది. చైనా-భారత సరిహద్దు ప్రాంతాలలో దురాక్రమణ పూరిత చర్యలను సాగించడం, సైనిక బలంతో యథాతథస్థితిని మార్చడం మాట అటుంచి, చైనా - భారత సరిహద్దులో ఏభాగంలోనైనాసరే వాస్తవంగా తమ అధీనంలోగల రేఖను చైనావారు ఏనాడూ దాటిపోలేదు. భారతప్రభుత్వం సాగించిన అలాంటి దురాక్రమణ చర్యలు సరిహద్దులో పశ్చిమ రంగాలలోనే గాక మధ్య రంగం, తూర్పురంగాలలోకూడ జరిగాయి. సరిహద్దు సమస్యమీద చర్చలు ఆరంభం కావడానికి ముందుగా సరిహద్దుమీద బలప్రయోగంతో మార్చిన యథాతథస్థితిని పునరుద్ధరించడంతప్పనిసరిఅయినపక్షంలో, సరిహద్దుపొడవునా చైనా ప్రాంతాలను ఆక్రమించుకున్న భారత సైనికులే అవిధంగా ఉపసంహరించుకోవాలి.

చర్చల అవసరం

భారత ప్రభుత్వం జరిపే దురాక్రమణ చర్యలకు చైనా ప్రభుత్వం అనేక పర్యాయాలు నిరసన తెలిపింది; చైనా భూభాగంనుండి తమ సైనికులను ఉపసంహరించమని అనేక సార్లు అడిగింది. అయినప్పటికీ సరిహద్దు సమస్యపై చైనా, భారత ప్రభుత్వాల మధ్యగల అన్ని వివాదాలను సంప్రతింపులద్వారా పరిష్కరించుకొనడానికి చైనా ప్రభుత్వం ఎల్లపుడూ ఇష్టపడుతూనే వుంది; సంప్రతింపులకు ఏనాడూ ఎట్టి షరతులనూ పెట్టలేదు. ఇప్పుడు భారత ప్రభుత్వం యీ సరిహద్దుమీద దురాక్రమణ చర్యలు కొనసాగిస్తూనే సంప్రతింపులకు చైనా ప్రభుత్వం ముందు ఒక షరతు పెట్టడానికి పూనుకున్నది. సంప్రతింపులంటే నిజాయితీ లేనన్న వాస్తవాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం భారత ప్రభుత్వం సందర్భశుద్ధిలేని ఈపద్ధతిని ఉపయోగించబోవడం పూర్తిగా నిరర్థకమని గట్టిగా చెప్పవచ్చును.

సరిహద్దుమీద ఉద్రిక్తతను సడలించడంలో ఆసక్తి ఉన్నట్లు భారత ప్రభుత్వం నటిస్తున్నదిగాని వాస్తవంలో యీ సరిహద్దు పరిస్థితిని సడలించాలని కోర్కెలు వెలిబుచ్చేసమయంలోనే సరిహద్దులో పశ్చిమ రంగంలో చైనా భూభాగంలోకి చొచ్చుకు వచ్చే చర్యలను, కవ్వింపు చర్యలను ఇనుమడింప చేస్తున్నది. పశ్చిమరంగంలో చైనా భూభాగంలో ఆగస్టు 4 వ తేదీనుండి భారత సైనికులు మరో పదకొండు సైనిక కేంద్రాలను స్థాపించారు; చైనా సరిహద్దు కాపలా దళాలమీద మరో 14 సార్లు కాల్పులు జరిపారు; చివరకు ఒక చైనా రవాణా బృందంమీద 200 గుండ్లు పేల్చి దొంగ చాటుగా దాడీసాగించారు. భారతీయ పక్షం వైపు నుండి రోజూ పెరిగిపోతున్న యీ దురాక్రమణ చర్యలు సరిహద్దు ఉద్రిక్తతను ఒక కొత్త ప్రమాద స్థాయికి తెస్తున్నాయి. ఈ పైన తెలిపిన వాస్తవ విషయాలన్నీ సరిహద్దు ఉద్రిక్తతను సడలించాలని భారత ప్రభుత్వం ప్రకటించుకుంటున్న కోర్కె పూర్తిగా అబద్ధమని తెల్పుతున్నాయి.

ఉద్రిక్తత సడలింపు

సరిహద్దుపై ఉద్రిక్త పరిస్థితిని తప్పనిసరిగా సడలించాలి. చైనా భూభాగంలోకి సాగిరావడాన్ని భారతీయ పక్షం నిలిపివేసినట్లయితే సరిహద్దుపై ఉద్రిక్తత తక్షణం సడలిపోతుందని చైనా ప్రభుత్వం తాను ఆగస్టు 4 వ తేదీన పంపిన పత్రంలో చెప్పింది. కాని భారత ప్రభుత్వంబలప్రయోగంతో యథాతథస్థితిని మార్చుతూ, సరిహద్దుపై ఉద్రిక్తతను మరింత పెంచుతూ చైనా భూభాగంలోకి సాగివస్తూనే "ఈ ప్రాంతంలో గత ఐదేండ్ల కాలంలోను బలప్రయోగంతో మార్చిన సరిహద్దు యథాతథస్థితిని పునరుద్ధరించడానికి తీసుకోనే చర్యలను నిర్వచించడం, ఈ ప్రాంతంలో ఇప్పుడున్న ఉద్రిక్తతలను తొలగించడం' సరిహద్దు సమస్యను గురించి చర్చించడానికి పూర్వం ఒక "అత్యవసరమైన మరను"గా వుండాలని నొక్కి చెబుతున్నది. ఇది పూర్తిగా అసంబద్ధమైనది. భారత ప్రభుత్వానికి ఒక విషయాన్ని మరోసారి జ్ఞాపకం చేయడం అవసరం; చైనా భూభాగాన్ని ఇంకా కొద్దికొద్దిగా ఆక్రమించుకొనడం ఇండియా సాగించినట్లయితే తప్పనిసరిగా చైనా ప్రతిఘటనను ఎదుర్కొన వలసివస్తుంది; అందువల్ల వచ్చే పరిణామాలన్నిటికీ వారే పూర్తి బాధ్యత వహించవలసి వుంటుంది.

ఈ పైన తెలిపిన వాస్తవ విషయాలనుబట్టిచూస్తే సంప్రతింపులద్వారా శాంతియుతంగా సరిహద్దు సమస్యను పరిష్కరించుకోవాలనేకోర్కె భారత ప్రభుత్వానికి లేదనీ, శాంతియుత సంప్రతింపులను చైనా భూభాగాన్ని కొద్ది కొద్దిగా ఆక్రమించుకోవాలన్న తన చర్యలను కప్పిపుచ్చుకోడానికి ఉపయోగిస్తున్నదనీ, సరిహద్దుపై యథాతథ స్థితిని మార్చ యత్నిస్తున్నారనీ ఎవరికైనా తెలియకపోదు.

1962 ఆగస్టు 22 వ తేదీని రాజ్యసభలో ప్రధాని నెహ్రూ మాట్లాడుతూ చైనా - భారత సరిహద్దు సమస్యమీద భారత ప్రభుత్వం "ద్వంద్వ విధానం" అనుసరిస్తుందని బాహాటంగా చెప్పనే చెప్పారు; రాజకీయ వత్తిడిద్వారా, సైనిక వత్తిడిద్వారా, తదితర వత్తిడుల ద్వారా తాము ఏలాభం పొందకోరుతున్నారో దానిని పొందాలన్న కోర్కెను వెలిబుచ్చారు. ఈ విధానాన్ని అనుసరించాలాలేక అవిధానాన్ని అనుసరించాలా అన్నది భారతదేశ స్వంత వ్యవహారం. అయితేమనపూర్తిగా కావాలనుకుంటే చైనామాత్రం సంప్రతింపులనే ఎంచుకుంటుంది; అలాగాక దాడి చేస్తే ప్రతిఘటించి తీరుతుంది; "దొంగ సంప్రతింపులు-నిజంగా పోరాడడం" అనే విధానంవల్ల భారతదేశానికి మంచి ఏమీ ఒనకూడదు.

చైనా భూభాగంలోకి భారత సైనికులు చొచ్చుకు రావడం అనేదానిని "పూర్తిగా అంతరంగిక విషయమనీ, తన భద్రత అవసరాల దృష్ట్యా భారత ప్రభుత్వం నిర్ణయించుకుంటుందనీ" రుజువు చేసుకొనడానికి భారత ప్రభుత్వం తన రెండు పత్రాలలోను చాలా గట్టిగా ప్రయత్నించింది. ఈ అర్థరహితమైన వాదనను చైనా ప్రభుత్వం లోగడ పంపిన తన పత్రాలలోఖండించింది; అందుకనిమళ్లీ ఇక్కడ పునశ్చరణ చేయవలసుకోలేదు. ఇప్పుడిక్కడ గుర్తించవలసిన దేమంటే, సరిహద్దు సమస్యమీద సంప్రతింపులను నిరాకరించడానికి ఏదో ఒక సాకును కనుగొనే ప్రయత్నంలో, ఆగస్టు 8 వ తేదీన చైనా విదేశాంగమంత్రి ఇచ్చిన టెలివిజన్ గోష్ఠిలోను, చైనా పంపిన ఆగస్టు 4 వ తేదీ పత్రంలోను వెల్లడైన చైనా వైఖరికి, సంప్రతింపులంటే ఒక షరతు పెట్టడమేనని భారతప్రభుత్వం భాష్యం చెప్పింది. ప్రతిరాజ్యానికి తన వైఖరిని స్పష్టీకరించడానికి స్వాతంత్ర్యమూ, హక్కూవున్నాయి. సరిహద్దు సమస్యమీద చైనా వైఖరిని భారత ప్రభుత్వం అంగీకరిస్తేనేగాని సంప్రతింపులు ఆరంభంకావని చైనా ప్రభుత్వం ఎన్నడూ చెప్పలేదు; పైగా అనేకసార్లు "అలాంటి సంప్రతింపులకుముందు షరతులు వుండకూడదు; పెట్టరాదు" అనే నొక్కి చెప్పింది. నిర్మొహమాటంగా చెప్పాలంటే చర్చించాలన్న కోర్కె భారత ప్రభుత్వానికి లేకపోతే ఆ మాటనే స్పష్టంగా ఎందుకు చెప్పరాదు? కారణం ఏదీ లేనిచోట ఒక కారణం కోసం బుర్రపాడుచేసుకోనే పనేలేదు.

చైనా ఉద్దేశంలో చైనా, భారత దేశాలవంటి రెండు పెద్ద ఆసియాదేశాల మధ్య దీర్ఘకాలంగా సరిహద్దు ఉద్రిక్తత కొనసాగటం మంచిదికాదు. ఉద్రిక్తతను సడలించాలన్న తలంపుతో సరిహద్దు పొడవునా యిరుపక్షాల సైన్యాలు 20 కిలోమీటర్ల వెనక్కు ఉపసంహరించాలని చైనా ప్రభుత్వం మరోసారి ప్రతిపాదిస్తున్నది. ఈచర్యను అమలుపరచినందువల్ల సరిహద్దు ఉద్రిక్తత వెంటనే సడలుతుందని భావించడమేగాక, సంప్రతింపులద్వారా శాంతియుత పరిష్కారం కుదిరేలోపున చైనా - భారత సరిహద్దుపై ఒక విధంగా స్థిరత్వం ఏర్పడుతుందని కూడ భావిస్తున్నాం.

ఎలాంటి షరతులూ విధించకుండా ఉభయదేశాల అధికారులూ తయారు చేసిన నివేదిక ఆధారంగా సరిహద్దు విషయమై చర్చలు ఆరంభించాలని చైనా ప్రభుత్వం కోరుతున్నది. ఇది చైనా,భారతప్రజల కోర్కె కేగాక శాంతిని కాంక్షించే దేశాల కోర్కెయు, ప్రజల కోర్కెకు అనుగుణమని భావిస్తున్నది. అక్టోబరు 15 వ తేదీన మొదట పెకింగ్‌లోను, ఆ తర్వాత న్యూఢిల్లీలోను యీ చర్చలు సాగించడానికి ఉభయ ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నియమించాలని చైనా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. వివరాలను దౌత్య మార్గాలద్వారా చర్చించి నిర్ణయించవచ్చును.

భారత ప్రభుత్వ సమాధానంకోసం చైనా ప్రభుత్వం ఎదురుచూస్తున్నది"

మాక్‌మోహన్ రేఖే సంప్రదాయక సరిహద్దు

భారత విదేశాంగ ఉద్యోగి ప్రసంగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12

'నేఫా ప్రాంతంపొడుగూతా భారత-చైనా సరిహద్దును మాక్‌మోహన్ రేఖ అని పిలవటం మనం ఎంత త్వరగా మానుకొంటే అంతమంచిది. ఎందుకంటే ఇదిసంప్రదాయసిద్ధంగా మనదేశ సరిహద్దు. అంతేకాక, ఇది హిమాలయ పర్వతశ్రేణి శిఖరాన్ని అనుకొని వెడుతుంది'అని భారతదేశ విదేశాంగ శాఖకు చెందిన డా. కె. గోపాలాచారి అన్నారు.

నేడిక్కడ ఒక సభలో ప్రసంగిస్తూ డా॥ గోపాలాచారి ఇంకా ఇలా అన్నారు:

"గతంలో ఎప్పుడూ టిబెటన్ల, చైనీయుల ప్రాబల్యం ఈ సాంప్రదాయసిద్ధమైన సరిహద్దుకు దక్షిణాన విస్తరించలేదు. ఈ సరిహద్దును సంప్రదాయక సరిహద్దు అనే పిలవడం సవ్యం.

2400 మైళ్ళ పొడువుగల ఈ సరిహద్దుకు ఒక ప్రత్యేకత వుంది. ఈకొసనుండి ఆ కొసవరకు ఇదంతా ఒకే నీటి చాలు. ప్రకృతి సిద్ధమైన, ముఖ్యంగా శాశ్వతమైన నీటి చాలును అనుసరించి వుండే సరిహద్దును ప్రత్యేకంగా నిర్వచించవలసిన అవసరంలేదు. దీన్ని ప్రత్యేకంగాగుర్తించవలసిన అవసరమూ లేదు."

ఇదే భారతదేశ ఉత్తర సరిహద్దు అని రుజువు చేయడానికి డా. గోపాలాచారి చారిత్రక ఆధారాలను, సంప్రదాయాలను ఉటంకించారు. లడక్‌లోని అక్సాయ్‌చిన్ ఎల్లప్పుడు భారతదేశంలో భాగంగాఉంటూ వచ్చిందన్నారు.

స్పీతీపై హిందూ రాజుల ఆధిపత్యం

స్పీతీ ఏడవశతాబ్దంలోనే హిందూ రాజులఆధిపత్యంలోఉన్న విషయాన్ని డా. గోపాలాచారి సభ్యులదృష్టికి తెచ్చారు. 19వ శతాబ్దంఆదిలో శిటాక్కీ కనుమ భారతదేశంలో భాగంగా పరిగణింపబడిందనీ, దక్షిణానగల గార్వాల్ కుమాక్, సెహ్రీ మొదలగు ప్రాంతాలను స్కందపురాణంలో "కేదార క్షేత్రం" అని పేర్కొన్నారనీ ఇది బ్రహ్మపురరాజ్యమని, ఆరు, ఏడు శతాబ్దాలలో చైనావారుకూడ గుర్తించారనీ డాక్టర్ గోపాలాచారి చెప్పారు.

నేఫా ప్రాంతంలో అత్యధిక భాగం ప్రాచీనకామరూపరాజ్యంలోభాగంగా విష్ణుపురాణంద్వారా తెలుస్తున్నదన్నారు. 8-12 శతాబ్దాల మధ్య ఈ ప్రాంతాలలోని తెగలపై అహోం రాజులు ఆధిపత్యం నెరపారన్నారు.

రెవిన్యూ లెక్కల్లో అక్సాయ్ చిన్ లడక్‌లో భాగంగా నమోదయి వుందన్నారు. నేఫా ప్రాంతంలో బ్రిటిష్ పాలకులు ఒక విధమైన ఆధిపత్యం నెరపారనీ అక్కడ తెగలమధ్య వచ్చిన కొట్లాటలను పరిష్కరించడానికి బ్రిటిష్ వారు సైనిక దళాలను పంపించేవారనీ అన్నారు. 1911-12 సీమ్లా ఒప్పందానికి ముందే ఈ ప్రాంతాన్ని బలిపర, సైదియా సరిహద్దు ప్రాంతాలుగా విభజించాలని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించినట్లు డాక్టరు గోపాలాచారి వెల్లడించారు.

శ్రీ దోనే మోషే రష్యాపయనం

ఖర్చులకు తోడ్పడమని ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ నాయకుని విజ్ఞప్తి

విజయవాడ, సెప్టెంబరు 23

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ గుంటూరు బాపనయ్యగారు విజ్ఞప్తి గావిస్తున్నారు.

సోవియట్ యూనియన్ వ్యవసాయ కార్మిక సంఘం ఆహ్వానంపై గుంటూరుజిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ దోనే మోషేగారు సోవియట్ యూనియన్ పర్యటనకై త్వరలో వెళ్ళుచున్నారు. శ్రీ మోషేగారు కడు బీద హరిజన కుటుంబంనుండి వచ్చారు. స్వంతఆస్తి ఏమీలేదు. గత 20 ఏండ్ల నుండి వ్యవసాయ కార్మిక ఉద్యమంలో కార్యకర్తగా పనిజేస్తూ సంఘమిచ్చే స్వల్ప వేతనంతోనే జీవనం గడుపుతూవున్నారు. కాబట్టి స్వంత ఖర్చులపైనవీరు సోవియట్ యూనియన్ పర్యటనకు పోలేరు. ఢిల్లీనుండిమాస్కోవరకూరాను పోను ఖర్చులూ, సోవియట్ యూనియన్‌లోఖర్చులూ సోవియటుసంఘమే భరించ వాగ్దానం చేసింది. కాబట్టి ఇతర ఖర్చులకు కనీసం రు. 500/-ల వరకైనా వీరికి కావలసివుంటుంది. వ్యవసాయకార్మిక ఉద్యమాభిమానులూ కార్యకర్తలూ ఈ మేరకు విరాళాలను వసూలుచేసి "శ్రీ దోనె మోషే, జిల్లా కమ్యూనిస్టు సమితి ఆఫీసు, 2 వ లైను, బ్రాడీపేట' గుంటూరు" అను పేర పంపవలసినదిగా కోరుచున్నాను.

శ్రీ టి. జగన్నాథరావు, బి. ఇ. (ఆనర్సు); ఎం. టెక్, లెక్చరర్, ఐ. ఐ. టి. ఖరగపురం, శ్రీమతి టి. ఉమా విజయలక్ష్మి, ఎం. ఎస్‌సి. ఉన్నత విద్యాభ్యాసానికై అమెరికా వెళ్ళారు. వీరు నర్సరావుపేట ఎస్. ఎస్. అండ్ ఎన్. కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ ఐ. రంగనాయకులుగారి అల్లుడు, కుమార్తె.

వాతావరణం

మద్రాసు, సెప్టెంబరు 23

ఈ నెల 25 వ తేదీ ఉదయం వరకూ సూచన :

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలలోను ఒకమోస్తరువర్షం లేదా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం అక్కడక్కడా పడవచ్చు.

వచ్చే రెండురోజుల్లో వాతావరణంలో అట్టే మార్పు ఉండదు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుచ్ఛక్తికి రు. 105కోట్లు

మూడవ ప్రణాళికలో కేటాయింపు: కేంద్ర ఇరిగేషన్ మంత్రి వెల్లడి

ఉదకమండలం, సెప్టెంబరు 23

దేశంలో పరిశ్రమల అభివృద్ధికి తగినట్టుగా, గ్రామీణ ప్రాంతాలలో విద్యుచ్ఛక్తి ఏర్పాట్లు చేయడానికిగాను కేంద్ర ప్రభుత్వం మూడవ ప్రణాళికలో 105 కోట్ల రూపాయల కేటాయించిందనీ, ఈ ప్రణాళికా కాలంలో మొత్తం 1089 కోట్ల రూపాయల మేరకు బృహత్తర విద్యుచ్ఛక్తి కార్యక్రమం వున్నదనీ కేంద్ర నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖల మంత్రి శ్రీ హఫీజ్ మహ్మద్ ఇబ్రహీం నేడిక్కడ చెప్పారు. నాల్గవ ప్రణాళికలో విద్యుచ్ఛక్తి అభివృద్ధికిగాను ప్రభుత్వం ముసాయిదా కార్యక్రమం తయారుచేసిందనికూడా ఆయన చెప్పారు.

నేడిక్కడ ప్రారంభమైన నీటి పారుదల, విద్యుచ్ఛక్తి విద్వద్గోష్ఠి 8 వ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ, శ్రీ ఇబ్రహీం ఈ విషయం తెలియజేశారు.

నాల్గవ ప్రణాళిక స్వరూప నిర్ణయానికీ, ప్రస్తుత కార్యక్రమాలను శీఘ్రంగా అమలు జరిపే ప్రయత్నాలలో ఎదురౌతున్న చిక్కులను తొలగించడానికీ, ఈ విద్వద్గోష్ఠి తోడ్పడుతుందనీ ఆయన ఆశాభావం ప్రకటించారు.

గ్రామీణప్రాంతాలలో విద్యుచ్ఛక్తి యేర్పాటుకయ్యే ఆర్థిక విషయాలపై మాట్లాడుతూ, ఈ ప్రాంతాలలో విద్యుత్ లైనులు ఏర్పాటు చేసేటప్పుడు చౌకగా లభించే పరికరాలను ఉపయోగించాలనీ, నిర్మాణ వ్యయం తక్కువ ప్రమాణంలో అయ్యేటట్లు చూడాలనీ ఆయన ఈ గోష్ఠికి సూచించారు.

మూడో ప్రణాళికలో నీటి పారుదల,విద్యుచ్ఛక్తి పథకాలు గత రెండు ప్రణాళికల అనుభవాన్ని దృష్టిలో వుంచుకొని అమలు జరపాలని ఆయన హితవు చెప్పారు.

నదీలోయ ప్రాజెక్టులనుండి వలస వచ్చిన కాందిశీకుల విషయంలో మానవతా వైఖరి నవలంబించి, వారికి తగు పునరావాస సౌకర్యాలు కల్పించాల్సి వుంటుందని శ్రీ ఇబ్రహీం ఈ గోష్ఠికి సూచించారు.

నీటి పారుదల పథకాలు పూర్తి ప్రయోజనాలు పొందాలంటే నీటినిల్వ సమస్యకు యెక్కువ ప్రాధాన్యత నివ్వాల్సివుంటుందని ఆయన చెప్పారు.

వరద నిరోధక చర్యల విషయంలో వస్తున్న విమర్శను ప్రస్తావించి,వరదలను పూర్తిగా నిరోధించటం అసాధ్యమనీ అయితే ప్రజల కష్టనష్టాలను పోగొట్టడానికి ఎంతో కృషి చేయవచ్చనని ఆయన చెప్పారు.

దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటంలో మూడవ ప్రణాళిక చాలవరకు కృతకృత్యమైందనీ, ఈ ప్రణాళిక జయప్రదం కావాలంటే అధికారులతో పాటు ఇంజనీర్లు సాంకేతిక నిపుణులు కూడా సహకారం యివ్వాలని శ్రీ ఇబ్రహీం సూచించారు.

తిరుపతిలో 27 పాకలు దగ్ధం

తిరుపతి, సెప్టెంబరు 2:

నిన్న తిరుపతి కోటకొమ్మల వీధిలోని 27 పూరియిండ్లు కాలిపోయాయి, రాజమ్మ అనే ఆమె నూరురూపాయల నోట్లు 7 కాలిపోయాయి. సుమారు 20 వేల రూపాయల ఆస్తి నష్టమైనట్లు అంచనావేశారు. స్థానిక శాసనసభ్యులు శ్రీ నాదమునిరెడ్డిగారు ఇండ్లు కాలిన కుటుంబాలకు నిన్న భోజన వసతి కల్పించారు. (వి. వి.)

వచ్చే ఏడు మన దేశంలో అంతరిక్ష రాకెట్ ప్రయోగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

అంతరిక్ష పరిశోధన జాతీయ కమిటీ కార్యక్రమాన్ని బట్టి భారత ప్రభుత్వం 1963 లో తమ తొలి అంతరిక్ష రాకెట్‌ను ప్రయోగించనున్నది.

రాకెట్ ప్రయోగ వేదిక దక్షిణ భారతంలో అయస్కాంత భూమధ్యరేఖకు దగ్గరగా ఒకచోట నెలకొల్పుతారు.

అంతరిక్ష పరిశోధక జాతీయసమితి ఈ నెల28న బొంబాయిలో సమావేశమై స్థలనిర్ణయం చేస్తారు. ఇందుకై తిరువనంతపురంవద్ద యిదివరకే పరిశీలించిన మూడు స్థలాలలో ఏదోఒకదాన్ని ఎన్నిక చేస్తారని తెలుస్తున్నది.

బొంబాయి సమావేశంలో బ్రిటిష్ అంతరిక్ష శాస్త్రజ్ఞులకమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ మాస్సీకూడా పాల్గొంటారని జాతీయ భౌతిక పరిశోధనశాలకు చెందిన డా. ఎ. పి. మైత్రా అన్నారు.

అంతరిక్ష పరిశోధనలో కామన్‌వెల్తు దేశాలు పరస్పరం సహకరించుకొనే విషయమై ఈ మన భారతీయ శాస్త్రజ్ఞులతో చర్చిస్తారట.

భారతదేశం ప్రయోగించే మొదటి రాకెట్ విదేశాలనుండి తెప్పిస్తారని కూడ డా. మైత్రా అన్నారు. మొదటి రాకెట్‌కు అయ్యే వ్యయం ఎక్కువగా వుండదన్నారు.

రవాణా,విద్యుచ్ఛక్తి ప్రాధాన్యత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

రవాణా, విద్యుచ్ఛక్తి సమస్యలపై భారత వాణిజ్య, పరిశ్రమల మండలి యాజమాన్యాన ఇక్కడ మూడు రోజులుగా సమావేశం జరిగింది.

తృతీయ ప్రణాళికా విజయం ప్రధానంగా రవాణా, విద్యుచ్ఛక్తి అభివృద్ధిపై ఆధారపడి వుందని ఆ సమావేశంలో అభిప్రాయం వ్యక్తపరచారు.

సమావేశానికి వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధులే గాక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రతినిధులు కూడా చాలమంది హాజరయ్యారు.

పంజాబులో వరద బీభత్సం: అమృతసర్‌లో ఇల్లు కూలి 8 మంది మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

కుండపోతగా కురుస్తున్న వర్షాల మూలంగా అమృత్సర్‌లో ఇల్లుకూలి 8 మంది మరణించారు. ఇంకా అనేక మందికి చిన్న పెద్ద గాయాలు తగిలాయి. అమృత్సర్‌లో గత 31 గంటలలో మొత్తం 11 అంగుళాల వర్షం కురిసింది. మొత్తం 500 ఇళ్ళు కూలిపోయాయి, 1600 ఇళ్ళకు పాక్షికంగా నష్టంజరిగింది. వందలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

నగరానికి చుట్టుప్రక్కల ప్రాంతాలలోరోడ్డు రైలు సంబంధాలు తెగిపోయాయి. ఒక్క అమృతసర్ - ఢిల్లీ రైలుమార్గం మాత్రమే పనిచేస్తున్నది.

భారీ వర్షాల ఫలితంగా పంజాబులో ఇంకా అనేక ప్రాంతాలలో భీభత్సం జరిగింది. రోడ్డు రైలు, వార్తా సౌకర్యాలు విచ్ఛిన్నమయ్యాయి. నదులు, వాగులు పొంగాయి. కాని ఇప్పుడు పరిస్థితి కొద్దిగా మెరుగైనట్టు కనిపిస్తున్నది. జగాద్రి తాలూకాలో 50 గ్రామాలు జలమయమైనాయి. చట్లినుంచి కాజిలాన్ వరకు గల వందమైళ్ల ప్రాంతం 5 అడుగులలోతు నీటిలో వుంది. ఆ గ్రామాల పరిస్థితి విషమంగా ఉంది. రావి, బియాస్, సట్‌లెజ్ నదులకు పెద్దవరదలు వచ్చాయి. సట్‌లెజ్ నదికి రూపార్ సబ్ డివిజన్లో గట్టు తెగుట వలన విశాల ప్రాంతం నీట మునిగింది. వార్తా సంబంధాలు తెగిపోవడం వల్ల నష్టం ఎంత జరిగిందీ తెలియడంలేదు.

మార్కాండ, టాంగ్రా నదులలో ఇంతవరకు ఎరుగనంతటి వరదలు వచ్చాయి. సుమారు మూడు వందల గ్రామాలుగల అంబాలా తాలూకా యావత్తు జలమయమైంది. గత 60 సంవత్సరాలలో ఇంత అధికంగా వర్షం ఎన్నడూ పడలేదని అధికార వార్తలు తెలియ జేస్తున్నాయి.

చండీగఢ్‌లో గతరాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. అనేక చెట్లు కూలిపోయాయి.

బంజరు ప్రాంతంలో వరద నష్టాలు

మంత్రికి వినతిపత్రం

బందరు, సెప్టెంబరు 20

గుండేరు-లజ్జబండ ముంపు రైతు మహాసభ కన్వీనరు శ్రీ వి. యస్. దాసుగారు బందరు ప్రాంతంలో ముంపు ఫలితంగా కలిగిన నష్టాలను వివరిస్తూ ప్రజలకు తక్షణమే సహాయం చేయాలనీ, ప్రభుత్వం శ్రద్ధ చేయక ఇప్పటికైనా ముంపు నివారణ చర్యలు ప్రారంభించాలనీ కోరుతూ మధ్యనిషేధ మంత్రి శ్రీ అప్పారావుగారికి నేడిక్కడ ఒక వినతిపత్రం సమర్పించారు. మునిసిపల్ కౌన్సిలర్ శ్రీ సత్యనారాయణ, శ్రీ చిన్నకోట వెంకటస్వామినాయుడు, శ్రీ నాగేశ్వరరావుగార్లుకూడా గుండేరు ముంపు ప్రమాదంగురించి మంత్రికి వివరించారు.

ముంపుప్రమాదపరిస్థితులు పరిశీలించి తక్షణ సహాయ్యాన్ని తగు చర్యలు తీసుకోవడానికి తాను ఇక్కడికి వచ్చానని మంత్రి తెలియజేశారు.

జిల్లాకాంగ్రెసు కార్యదర్శి శ్రీ తమా బత్తుల లక్ష్మీనరసయ్యగారు, పడిపోయిన ఇళ్ళకు వెంటనే ధన సహాయం, పేదప్రజలకు ఆహారం, రైతాంగానికి అప్పులు ఇవ్వాలని చెప్పారు.

శాసనసభ్యులు శ్రీ పమిడేశ్వరరావుగారు బందరు తాలూకాలో 30 వేల ఎకరాలు మునిగిపోయిందనీ, లజ్జబండ ముంపు ప్రాంతాలు మంత్రి చూడాలని కోరారు.

పి.డబ్ల్యు. డి. అధికారులతో సంప్రదించి యింతవరకైనా పథకాలు తయారైనవేమో విచారించి ముంపు నివారణకు తీవ్రచర్యలు తీసుకొంటామని మంత్రి చెప్పారు.

కట్లపల్లి గ్రామస్థులు గ్రామమంతా నీటితో నిండి, యిళ్లు పడిపోయి పైరు మునిగి నిరాశ్రయులమైనామనీ, తిండి లేక బాధపడుతున్నామనీ చెప్పారు. వారికి తగు సహాయం యిమ్మని కలెక్టరుకు మంత్రి చెప్పారు.

జిల్లా కలెక్టరు ప్రకటన

జిల్లా కలెక్టరు ఈ నెల 19న తేదీ పత్రికా విలేఖరులను పిలిచి, జిల్లాలో ముంపు ప్రమాదం గురించి ప్రకటన చేస్తూ జిల్లా మొత్తంమీద బుడమేరు, కొల్లేరు, గుండేరు, లజ్జబండ వంటి మురుగు కాల్వలవల్లగాని యితరంగాగాని మొత్తం 32 వేల యకరాలు మునిగిపోయిందనీ, గ్రామకరణాల రిపోర్టుల ప్రకారం యీ సమాచారం తనకు చేరిందనీ, పూర్తిగా ముంపు తగ్గిన తరువాత అసలు నష్టంగురించిన అంచనాలు సరిగ్గా వస్తాయనీ చెప్పారు. బందర్లో 200 పైగా యిళ్లు పడిపోయాయన్నారు. జిల్లాలోనూడ కొన్ని చోట్ల యిళ్లు పడిపోయినవనీ, యిళ్లు పడిన లెక్కలు సేకరించి వారికి తగు సహాయం చేయడానికి యేర్పాట్లు చేస్తున్నామన్నారు.

కలెక్టరుతో శ్రీ మండల వెంకటస్వామి చర్చ

పార్లమెంటు సభ్యులు శ్రీ మండల వెంకటస్వామిగారు అదేరోజు జిల్లా కలెక్టరును కలసి, గుండేరు, లజ్జబండ ప్రాంతాలలో తన పర్యటనానుభవాలను తెలిపారు. ప్రమాద తీవ్రత చాలావుందనీ 60, లక్షల నష్టమనీ, వెంటనే నిరాశ్రయులకు ఆహారం అందించాలనీ, పైర్లు పూర్తిగా మునిగిపోయిన రైతుల వ్యవసాయ ఖర్చులు పరిహారంగా ఇచ్చి, రైతులందరికీ దీర్ఘ కాల వాయిదాల మీద అప్పులు యివ్వాలనీ కోరారు.

15 సంవత్సరాలుగా ప్రభుత్వం ఈ ప్రాంతంలో ముంపు రైతులకు చాల ధనం శిస్తు రెమిషన్‌గా యిస్తూ వచ్చిందనీ, అదే కాలంలో రైతుల పంటలు మురుగు కారణంగా చాల దెబ్బతిని ఎంతో నష్టం కలిగిందనీ, ఈ ప్రాంతంలో శాశ్వతముంపు నివారణకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలనీ కూడ కోరారు. జేవరపల్లి, పల్లివాడు, కట్లపల్లి, ఈడుమూడి, కత్తులవానిపాలెం గ్రామాలకు 15 రోజులు ఉచితాహారం అందించాలన్నారు. తగు చర్యలు తీసుకొంటామని కలెక్టరు అన్నారు.

జిల్లా పరిషత్ అధ్యక్షుని ప్రకటన

జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ మాగంటి అంకినీడుగారు అదేరోజు పత్రికా విలేఖరులను పిలిచి, జిల్లాలో తక్షణ చర్యల గురించి ఒక ప్రకటన చేశారు.

ఈ నెలలో కురిసిన తీవ్రవర్షాలవలన జిల్లాలో వేలాది యకరాల పంట మునిగిపోయిందనీ, వర్షాలకు తోడు మురుగుకాల్వలు లోతుగాను, వెడల్పుగాను త్రవ్వకపోవడం, గట్లు బలపరచకపోవడంవల్ల యింత కాలంవరకు తగ్గలేదన్నారు. పైర్ల నష్టం కొన్ని లక్షల రూపాయలలో ఉంటుందన్నారు.

వెంటనే ముంపు ప్రాంతంలోని పేదలకు ఆహారం, పడిపోయిన యిళ్లకు ధనసహాయం, పూర్తిగా పైరు మునిగిన చిన్న రైతులకు వ్యవసాయ ఖర్చుల నష్టం పూడ్చడానికి ఉచిత ధనసహాయం, రైతాంగం తిరిగి కోలుకొనడానికి దీర్ఘ కాలవాయిదాలమీద అప్పులు యివ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జిల్లా గ్రామోద్యోగుల సంఘాధ్యక్షుని ప్రకటన

బందరు, సెప్టెంబరు 19

కృష్ణాజిల్లా గ్రామోద్యోగుల సంఘ అధ్యక్షులు శ్రీ కూనపురెడ్డి సుబ్రహ్మణ్యంగారు ఈ క్రింది విధంగా ప్రకటిస్తున్నారు:

"ఈ మధ్య కురిసిన అధిక వర్షాలకు కృష్ణాజిల్లాలో పంటలుదెబ్బతిన్నాయి. ముఖ్యంగా బందరు తాలూకాలో పంటచేలు నీట మునిగిపోయి పొలాలమీదుగా ఒక అడుగునుండి రెండడుగులవరకు నీరు ప్రవహిస్తోంది. గ్రామాలకు గ్రామాలు జలమయమయినాయి. ఇండ్లు పడిపోయినాయి. పొలాలలో మేసిన ఎనుములు కొట్టుకొని పోయాయి. పశువులకు గడ్డిలేదు. అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు తమ భవిష్యత్తును గురించి ఆందోళన చెందుతున్నారు.

ఇటువంటిపరిస్థితులలోశిస్తులు,రుణాలు వగైరా బకాయీలు వసూలుచేయమని పై అధికారులు వత్తిడి చేస్తున్నారు. వసూలుచేయకపోతే, చర్య తీసుకొంటామంటున్నారు. ప్రజల పరిస్థితులుచూస్తే చాలా హృదయవిదారకంగావున్నాయి. అధికార్ల ఉత్తర్వులు వీటికి భిన్నంగా వుంటున్నాయి. అందువల్లగ్రామోద్యోగులు వీటి మధ్య నలిగిపోతున్నారు. పరిస్థితులను గమనించి అధికార్లు శిస్తులూ, రుణాలు, అన్నిరకాల బకాయీలు వసూళ్ళ వాయిదా వెయ్యాలనీ, వసూలు చెయ్యలేదని ఎవ్వరిమీదా చర్య తీసుకోరాదనీ కోరుతున్నాను."

కొల్లేరు వరదబాధితులు

ప్రభుత్వసహాయానికై విజ్ఞప్తి

కైకలూరు, సెప్టెంబరు 19

వరదలమూలంగా కొల్లేటి ప్రాంతంలో ఇండ్లుమునిగి,వలసవస్తున్న ప్రజానీకానికి వెంటనే రక్షణ కలిగించాలని, పశుగ్రాసాన్ని సప్లయిచేయాలనిప్రభుత్వాన్ని కోరుతూ కృష్ణాజిల్లా కైకలూరు తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశంలో తీర్మానించారు. కమిటీవారు ప్రభుత్వానికి యింకా ఈ దిగువ సూచనలు చేశారు.

ఇండ్లు పడిపోయినవారికి ఆర్థిక సహాయం చేయాలి. పంటపోయిన భూమికి పూర్తి శిస్తు రెమిషన్ ఇవ్వాలి. తక్కావీ రుణాలు వగైరా వసూళ్ళు వాయిదా వేయాలి. ఉప్పుటేరు, బుడమేరు స్కీములను ప్రత్యేక శ్రద్ధతో పూర్తిచేయాలి. పోల్‌రాజు డ్రైనును పూర్తిగా మరమ్మతు చేయించాలి. తాలూకా మొత్తానికి దాళవాకు నీరు సప్లయి చేయాలి. ముందుగానే దాళవా వుందని ప్రకటించాలి. మురుగువల్ల, ముంపువల్ల వచ్చే అంటువ్యాధులనుంచి తక్షణం రక్షణ కల్గించాలి. ఇండ్లుపోయి, లేదా మునిగిపోయి వలస వచ్చిన కుటుంబాలకు వ్యక్తి పూచీపైన అప్పు ఇవ్వాలి.

పత్రికా సలహా సంఘ నిర్మాణం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

పత్రికలకు సంబంధించిన విషయాలపై తనకు సలహాలు ఇచ్చేందుకై భారత ప్రభుత్వంఒక సలహాసంఘాన్ని నియమించింది.

కమిటీకి సమాచార, రేడియోశాఖ మంత్రి అధ్యక్షుడు, ఈ శాఖ ఉపమంత్రి ఉపాధ్యక్షుడు. పత్రికలతో సంబంధంలేని ప్రముఖ అనధికార వ్యక్తులు ఐదుగురు, వివిధ పత్రికల ప్రతినిధులు (పదిహేను మించకుండా) ఇందులో సభ్యులు.

కమిటీలో హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ టైమ్స్ మొదలగు ప్రముఖ ఇంగ్లీషు పత్రికల సంపాదకులూ, ఆంధ్రజ్యోతి సంపాదకుడు శ్రీ నార్ల మొదలగువారున్నారు.

పాత్రికేయుల సమాఖ్యా అధ్యక్షుని ఈకమిటీలో సభ్యుడుగా వుండవలసిందిగాప్రభుత్వం కోరింది.

దేశంలో ప్రధాన ప్రతిపక్షమయిన కమ్యూనిస్టుపార్టీ అభిప్రాయాలను ప్రతిబింబించే పత్రికల ప్రతినిధిని ఎవ్వరినీ కమిటీలో నియమించలేదు.

అధ్యక్షుడు మరికొంత మంది సభ్యులను కో ఆప్ట్ చేసుకోవచ్చునని ఈ సందర్భంలో వెలువడినప్రకటనలో వివరించారు.

ఈ కమిటీ వ్యవధి రెండేళ్లు.

మల్లాపురంలో వరద

రామగుండం, సెప్టెంబరు 20

సుల్తానాబాద్ తాలూకా పెద్దపేట, రాయిదండి, జంగాలపల్లి, మేడపల్లి జనగామ గ్రామాలలో గోదావరి వరద వల్ల దాదాపు 1200 ఎకరాలు మునిగిపోయినవి.

మల్లాపురంలో 40 యిండ్లు వరదకు నష్టమైనాయి. ప్రజలు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు.

గుంటూరుజిల్లా వరద బాధితులకు సాయం

శాసన సభ్యులతో జిల్లాకలెక్టరు చర్చ

గుంటూరు, సెప్టెంబరు 23

గుంటూరు జిల్లాలో యిటీవల అధిక వర్షాలవల్ల నష్టపడిన వారికి సహాయం కల్పించే నిమిత్తం యీ రోజు ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీ శ్రావణకుమార్ గారు జిల్లాలోని శాసన సభ్యుల సమావేశం జరిపారు.

నష్టపడిన ప్రాంతాలకు 500 టన్నుల అమోనియం సల్ఫేటు ప్రత్యేక కోటాగా నిర్ణయించి, ఎకరం 1కి 44 పౌన్లు చొప్పున పంచడానికి నిర్ణయించారు. తెగుళ్లు సోకిన పొలాలకు, వాటి నివారణకు వ్యవసాయ శాఖ ద్వారా మందుజల్లే యేర్పాట్లు చేయుచున్నారు. ప్రతీ రెవిన్యూ డివిజనల్ ఆఫీసరువద్ద పదివేల రూపాయలు అడ్వాన్సువుంచి, రైతులకు అప్పులిచ్చే యేర్పాటు చేశారు.

గుంటూరు పట్టణంలో11 యిండ్లకు, తెనాలిలో 18 యిండ్లకు ఒక్కొక్క యింటికి రు 15 లు చొప్పున పంచిపెట్టినట్లుగా యిప్పటికి అందిన వార్తలవల్ల తెలిసింది. వివిధ ప్రాంతాలకు చెందిన శాసన సభ్యులు, రెండవ పంటకు తుంగభద్రనీరు యిప్పించే యేర్పాట్లు చేయించమని, పూడిపోయివున్న పంట కాల్వలను బాగుచేయించమనికోరారు.

జాయింటు కలెక్టరు, తానుజిల్లాలో నష్టపడిన వివిధప్రాంతాలను స్వయంగా పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయదలచినట్లు శ్రీ శ్రావణకుమార్ 'విశాలాంధ్ర విలేకరి' కలుసుకోగా తెలియజేశారు.

ఈ సమావేశం అనంతరం, జిల్లాలోని రెవిన్యూ అధికార్ల సమావేశం కూడా జరిగింది. (వి. వి.)

తర్లుపాడు సమితి కో-ఆప్షన్‌లు

తర్లుపాడు, సెప్టెంబరు 20

నెల్లూరు జిల్లా పొదిలితాలూకా తర్లుపాడు పంచాయతీ సమితి కో ఆప్షన్‌లను నేడు సమితి ఆఫీసులో కందుకూరు ఆర్. డి. ఓ. జరిపారు.

ఈక్రిందివారు ఏకగ్రీవముగా ఎన్నిక అయినట్లు ప్రకటించినారు.

శ్రీయుతులు గాయం లక్ష్మిరెడ్డి (పోతలపాడు), శ్రీ షేజాల పాపా సాహెబ్ (తర్లుపాడు), శ్రీ పిల్లి పెద చెన్నయ్య (కొనకలమిట్ల), శ్రీ శిగినం కోటయ్య (మంగాపురం), శ్రీమతి గంటా వెంకటసుబ్బమ్మ (కందివారిపల్లె) శ్రీమతి మూర్తి వెంకటరత్నమ్మ (తర్లుపాడు).

సమితి అధ్యక్షుని ఎన్నిక ఈ నెల 29 న జరుగుతుంది.

మరో తొమ్మిది మంది నాగా తిరుగుబాటుదార్లు ప్రభుత్వానికి శనివారం నాడు లొంగిపోయారు. దీనితో యిప్పటికి మొత్తం 89 మంది లొంగిపోయారు.

ఆక్రాలో అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లు ప్రకటన:

ఊరేగింపులపై నిషేధం, కర్ఫ్యూ ఉత్తర్వు అమలు

ఆక్రా, సెప్టెంబరు 22

ఇటీవల జరిగిన బాంబుల ప్రేలుళ్ళ కారణంగా ఆక్రాలో నేడు అత్యవసర పరిస్థితులు ఏర్పడినట్లు ఘనా అధ్యక్షుడు న్క్రుమా ప్రకటించారు.

ఈ ప్రకటన అధ్యక్షుని కార్యాలయం నుండి ప్రకటించబడింది.

ఇతర ప్రాంతాల నుండి గతరాత్రి రాజధానికి వందలాది పోలీసులను రప్పించారు.

గత గురువారంనాడు జరిగిన బాంబుల ప్రేలుడు వలన వందమంది గాయపడ్డారు. అందులో ముగ్గురు చనిపోయినట్లు ఆసుపత్రుల అధికారులు తెలిపారు.

అధ్యక్షుడు న్క్రుమా జన్మదినోత్సవం సందర్భంలో వేలాదిమంది బాలల ఊరేగింపు జరిపిన సందర్భంలో ఈ బాంబుల ప్రేలుడులు జరిగాయి.

చనిపోయిన వారిలో పద్దెనిమిదేండ్ల వయస్సుగల బ్యాండు వాయిద్యగాడున్నాడు.

గత ఏడు వారాల కాలంలో ఇలా బాంబులు ప్రేలడం మూడోసారి.

ఊరేగింపులన్నీ నిషేధించబడినాయనీ, కర్ఫ్యూ ఉత్తర్వుఅమలు జరుగుతుందనీ, ఇండ్లను సోదా చేయడానికి వీలుగా పోలీసులకు ప్రత్యేక అధికారాలియ్యబడినాయని ఘనా రేడియో ప్రకటించింది. గతరాత్రి జరిగిన బాంబు ప్రేలుడులో ముగ్గురు చనిపోయారు 120 మంది గాయపడ్డారు.

భారత ప్రధాని శ్రీ నెహ్రూ ఇక్కడికి వారం రోజుల్లో రాబోతున్నారు.

ఘనాలో ఇల్లిల్లూ సోదా

ఆక్రా, సెప్టెంబరు 22

ఆక్రాలో ప్రమాద పరిస్థితులున్నట్లు అధ్యక్షుడు న్క్రుమా నేడు ప్రకటించిన తరవాత ఆయుధాల కొరకు ఉక్కుటోపీ పోలీసులు నేటి ఉదయం ప్రతి ఇల్లూ శోధించడం మొదలుపెట్టారు.

జంట నగరాల్లో వరద బాధితులు

రెండు లక్షల రూపాయల నివ్వాలని డాక్టర్ గౌడ్ విజ్ఞప్తి

హైద్రాబాద్, సెప్టెంబరు 22

గత వారంలో పడిన భారీ వర్షాల, మూలంగా జంట నగరాలలో కూలిపోయిన ఇండ్లవారికి వెంటనే రెండు లక్షలరూపాయలను పంచిపెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ హైద్రాబాద్ నగర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి డాక్టర్ రాజబహాదూర్ గౌడ్ నేడొక ప్రకటన చేశారు.

జంట నగరాల్లో వర్షాల మూలంగా దాదాపు అయిదువేల యిండ్లు కూలిపోయినాయనీ, దాదాపు 30 వేలమంది నిరాశ్రయులయ్యారని డాక్టర్ గౌడ్ తన ప్రకటనలో తెలిపారు.

మేయర్ శ్రీమతి కుముదినీదేవి ఏర్పాటు చేస్తున్న సహాయకార్యక్రమాన్ని డాక్టర్ గౌడ్ మెచ్చుకొంటూ సహాయం వెంటనే అందరికీ అందేలా చూడటానికి సహాయక కమిటీలలోకి అన్ని పార్టీల ప్రతినిధులను నియమించాలని ఆయన సూచించారు.

వచ్చే పదేళ్లలో వ్యవసాయోత్పత్తి రెట్టింపు

వి.టి. కృష్ణమాచారి ఆశాభావం

మద్రాసు, సెప్టెంబరు 20

వచ్చే ఏడేళ్ళలో దేశంలో వ్యవసాయోత్పత్తి రెట్టింపవుతుందని జాతీయ ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు శ్రీ వి.టి.కృష్ణమాచారి ఒకసభలో మాట్లాడుతూ అన్నారు.

శ్రీ కృష్ణమాచారి ఇలా అన్నారు: "వచ్చే 20 ఏళ్లలో దేశ జనాభా 50 కోట్లకు పెరుగుతుందనే అంచనాతో 1956 లో ఉత్పత్తి లక్ష్యాలు నిర్ణయించాము. జనాభా 60 కోట్లకు పెరుగుతుంది. కాబట్టి ఈ లక్ష్యాలను పునఃపరిశీలన చేయవలసివుంది.

వచ్చే పది సంవత్సరాలలో గ్రామీణ రంగంనుండి వచ్చే ఆదాయం రెట్టింపు కాకుండా, వచ్చే 15 సంవత్సరాలలో తలసరి ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యం సాధించనూలేము; ప్రజలకు సరిపడా తిండి సరఫరా చేయనూలేము."

సోవియట్ నౌకా విధ్యుయిజ్, సముద్ర పరిశోధనలకై మద్రాసు చేరుకున్నది.

చైనాపై యు-2 విమానోదంతం

వార్సా సమావేశంలో అమెరికాకు చైనా నిరసన

వాషింగ్టన్, సెప్టెంబరు 21

సెప్టెంబరు 9 తేదీన చైనా ఆకాశతలంలో కన్పడి, కాలబడ్డ అమెరికా యు-2 (కొమింటాంగ్) విమాన గూఢచారిత్వంపై నిన్న వార్సాలో ఒక సమావేశంలో చైనా అమెరికాకు నిరసన తెలిపిందని నేడు అభిజ్ఞవర్గాలవారు తెలిపారు.

నేపాల్ విదేశాంగ మంత్రి మార్పు

శ్రీ రిషికేశషా తొలగింపు

ఖాట్మండూ, సెప్టెంబరు 22

నేపాల్ మంత్రివర్గం నుండి నేడు విదేశాంగమంత్రి శ్రీ రిషికేశషా తొలగించబడ్డారు.

మంత్రివర్గంలో యింకా ఏకీభావం, ఐక్యత వుండేందుకే ఈ చర్య తీసుకోబడినదని ఆ ప్రభుత్వప్రకటనలో వుంది.

విదేశాంగ శాఖను డాక్టర్ తులసీగిరికి తిరిగి అప్పగించారు. శ్రీ షాకు ఈ శాఖ మూడు నెలల క్రిందటనే అప్పగించబడింది.

మరొక మంత్రి శ్రీ అనిరుద్ధప్రసాద్‌సింగ్‌నుకూడా అతని పదవినుండి తొలగించారు. అతను నిర్వహించుతూ వున్న న్యాయ పరిపాలనా శాఖను శ్రీ విశ్వనాథ్‌తాపాకు అప్పగించారు.

రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ మహాసభ

ఎ. పి. టి. యు.సి వివరణ

హైద్రాబాద్, సెప్టెంబరు 22

విజయవాడలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ తృతీయ మహాసభకు ప్రతినిధులను పంపే అనుబంధసంఘాలు తమఅనుబంధ రుసుమును అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకుపంపించాలని ఎ పి. టి. యు సి. కార్యాలయం ప్రకటిస్తున్నది. ప్రతినిధి నుండి వసూలుచేసే రెండు రూపాయల రుసుములో అతనికి సరఫరా చేసే ట్రేడ్‌యూనియన్ పత్రాల వ్యయం కూడా చేరి వుందనీ ఈ విషయం అన్ని ట్రేడ్‌యూనియన్లు గమనించాలనీ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

నేపాలీతిరుగుబాటు దార్లకు కేంద్రం

భారతదేశమేనని నేపాలీ పత్రికల ఆరోపణ

ఖాట్మండూ, సెప్టెంబరు 22

భారత భూభాగాన్ని కేంద్రంగా చేసుకొని నేపాల్ తిరుగుబాటుదార్లు నేపాల్ ప్రాంతాల్లో దాడులుచేస్తున్నారని నేపాల్ రేడియో, నేపాల్ ప్రభుత్వ పత్రిక 'గోరఖపత్ర' తదితర వార్తా పత్రికలు నేడు వార్తలను ప్రకటించాయి.

ఈ దాడులకు సంబంధించిన రకరకాల వార్తలను నేపాలీ పత్రికలు ప్రకటించుతున్నాయి.

ఒక నేపాలీ పోలీసుస్టేషను వద్ద, కస్టమ్స్‌పోస్టువద్ద, బాంబులు ప్రేలుళ్లు జరిగాయనీ, ఎనిమిదిమందో, పదిమందో గాయపడ్డారని ఒక వార్తలో వున్నది.

భారత భూభాగాన్ని కేంద్రంగా పెట్టుకొన్న ఒక బందిపోటు దొంగను అరెస్టు చేశామనికూడ ఒక వార్తలో వుంది

అర్జెంటైనాలో ప్రభుత్వ కేంద్రం తిరుగుబాటుదారులవశం

అధ్యక్షుడు మొదలయినవారి పలాయనం

బ్యూనోస్‌ఎయిర్స్, సెప్టెంబరు 22

అర్జెంటైనా రాజధాని బ్యూనోస్ ఎయిర్స్ మధ్య భాగంలో ఉన్న ప్రభుత్వ భవనాన్ని, తిరుగుబాటు సైనిక దళాలు, టాంకుల సహాయంతో నేడు ఆక్రమించుకున్నాయి. సైనిక దళాలన్నీ బారకాసులలోకి పోవాలని, అధ్యక్షుడు రేడియోలో ప్రకటించిన ఉత్తర్వులను ధిక్కరించి, ఈ తిరుగుబాటు సైనిక దళాలు ఇలా ముందుకు సాగాయి.

ప్రభుత్వ భవనాన్ని తిరుగుబాటు సైనికులు ఆక్రమించుకోడానికి కొంచెం ముందుగా అధ్యక్షుడు జోస్ మారియాగ్విడో, ప్రభుత్వ భవన రక్షణాధికారి, అతని ఉద్యోగులూ అంతా, ఆ భవనాన్ని ఖాళీచేసి పోయారు.

ఇదంతా జరిగిన కొద్దిసేపటికి నౌకాదళంకూడా, తాము అధ్యక్షుడు గ్విడో ప్రభుత్వానికి వ్యతిరేకులమని తిరుగుబాటుప్రకటించింది. ఆయనరాజీనామా ఇవ్వాలని డిమాండ్ చేసింది.

నౌకా, సైనిక, వైమానిక దళాధిపతులు కలిసి సైనిక ప్రభుత్వాన్ని నేర్పరచాలని నౌకా దళంవారు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తూంది.

గోదావరి వరద తగ్గుముఖం

రాజమండ్రి, సెప్టెంబరు 22

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం ఆనకట్టవద్ద 15.6 అడుగులుంది. వంతెన వద్ద 61.6 అడుగులున్నది. దుమ్ముగూడెం వద్ద గంటకు 0.2 చొప్పున, రాజమండ్రి వద్ద 0.5 చొప్పున వరద తగ్గుతూంది.

వరద ఇప్పుడు తగ్గుతున్నప్పటికీ గత మూడు రోజులుగా హెచ్చుస్థాయిలో వరద ఉండటంవలన రాజమండ్రిలోని పల్లపు ప్రాంతంలలో మూడు నాలుగు అడుగుల ఎత్తున నీరు నిలిచి ఉంది. వర్షంవలన కురిసిన నీరు, కరకట్టనుండి పూరిన నీరు నిలిచి ఈ ప్రాంతాలన్నీ నివాస యోగ్యంగా లేవు. ముఖ్యంగా ఆల్కట్ గార్డెన్స్, తుమ్మలావ, రామచంద్రరావుపేట మున్నగునవి ఈ ప్రాంతాలనుండి 00 కుటుంబాలు సురక్షిత స్థానాలకు తరలించబడినాయి. వీరందరికి తగు సహాయం చేయబడుతూంది. మున్సిపల్ తాత్కాలిక ఛైర్మన్ శ్రీ బాలజీదాస్ ముంపువలన ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల నిమిత్తం రు 500 మంజూరు చేశారు. ఈ పల్లపుప్రాంతాలలో నీటిని పంపులద్వారా తోడివేయడం మొదలుపెట్టారు. రెవెన్యూశాఖవారు ములకిల్లంక, దేసిపట్నం మున్నగు గ్రామాలకు బియ్యంసరఫరా చేస్తున్నారు.

రాజమండ్రి తాలూకాలో సుమారు 5 వేల ఎకరాలు వరదదెబ్బకు గురి అయినాయి. అమలాపురం తాలూకా మున్నగు ప్రాంతాలలో వరద నష్టం చాలా విపరీతంగా వున్నట్టు తెలుస్తూంది. ఆ ప్రాంతాలతో సరియైన వార్తా సంబంధాలు లేకపోవడంవలన అక్కడి నష్టాలు గురించి వివరంగా ఏమీ తెలియరావడంలేదు.

విజయవాడలో టెలిఫోన్ ఆపరేటర్ల శిక్షణా కేంద్రం

నవంబరు 1వ తేదీనుండి ప్రారంభం

విజయవాడ, సెప్టెంబరు 22

నవంబరు 1వ తేదీనుండి టెలిఫోన్ ఆపరేటర్ల శిక్షణా కేంద్రాన్ని విజయవాడలో ప్రారంభిస్తారు. స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజి కార్యాలయంలో యీ కేంద్రాన్ని నెలకొల్పుతారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది రెండవ కేంద్రం. మొదటి కేంద్రం హైదరాబాదులో ఉంది.

ఈ శిక్షణ రెండు మాసములు యిస్తారు. ప్రతి జట్టులోనూ 50 మంది ఆపరేటర్లకు శిక్షణ యిస్తారు.

లైన్‌మన్, మెకానిక్కు, సూపర్‌వైజర్‌లవంటి తంతి సంబంధాల శాఖలోని సబార్డినేట్ ఉద్యోగులకు కూడా త్వరలో కాకినాడలో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రంలో ప్రతి సంవత్సరం 100 మందికి శిక్షణ యిస్తారు. ఇటువంటి కేంద్రాలు దేశంలో ప్రస్తుతం జబల్‌పూర్, తిరువనంతపురం, మద్రాసులలో మాత్రం ఉన్నాయి.

పోస్టుమాస్టర్ జనరల్ శ్రీ మార్కస్ డెలిమాగారు పై విషయాలను నిన్న ఇచ్చట జరిగిన తంతితపాలా యింజనీరింగు ఉద్యోగులసమావేశంలో వెల్లడించారు. ఆంధ్ర సర్కిల్‌లోని ఇంజనీరింగ్ శాఖోద్యోగులందరూ యీ సమావేశంలో పాల్గొన్నారు. తంతి శాఖా డైరక్టర్ శ్రీ కె. శ్రీనివాసన్ గారు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజలవద్దనుండి వచ్చే ఫిర్యాదులు త్వరత్వరగా పరిష్కరించాలనీ, జరిగిన తప్పులను వెంటనే సరిచేయాలనీ ఉద్యోగులను శ్రీ డెలిమా కోరారు. ఉద్యోగంలో విధేయతను అలవర్చుకోవాలన్నారు. (వి. వి.)

రష్యాకు రాజ్యవిస్తరణ కాంక్ష లేదు

ఫ్రెంచిరేడియోగోష్ఠిలో శ్రీ నెహ్రూ ప్రకటన

పారిస్, సెప్టెంబరు 22

రష్యా మనస్ఫూర్తిగా శాంతినే కాంక్షించుతున్నదని, తమ ప్రాంతాలను విస్తరించుకోవాలనే విధానాన్ని అవలంబించడం లేదని తాను నమ్ముతున్నట్లు భారత ప్రధాని శ్రీ నెహ్రూ నేడిక్కడ అన్నారు.

"కాని చైనాను గురించి ఆ మాట చెప్పడం సాధ్యం కాదు. గతంలో చైనా ఎప్పుడూ రాజ్యాన్ని విస్తరించుకొనే విధానాన్నే అవలంబించింది. ఇప్పుడుకూడా భారతదేశ భూభాగంపై విస్తరించుకోవాలని చూస్తున్నది" అని శ్రీ నెహ్రూ ఫ్రెంచి రేడియో, టెలివిజన్ ఇంటర్వ్యూలో 'చైనా - రష్యాలు రాజ్య విస్తరణ విధానాలను అవలంబించుతున్నాయని మీరు భావిస్తున్నారా" అని ప్రశ్నించగా పై సమాధానం యిచ్చారు.

సోవియట్ యూనియన్ చైనాల విధానాలలో చాల పెద్ద తేడాలున్నాయని శ్రీ నెహ్రూ అన్నారు.

విప్లవం తరువాత బ్రహ్మాండమయిన అభివృద్ధి సాధించిన రష్యాదేశం విస్తరణవాది కాదు. కాని సైనికకూటముల కారణంగా ప్రపంచంలో కొన్ని భాగాలలో అది ఇరుక్కోనవలసి వచ్చే అవకాశాలున్నాయి.

"కాని చైనానుగురించి నేనిదేమాట చెప్పజాలను. అది దురాక్రమణ దారుగాను, విస్తరణవాదిగాను మాకు కనపడుతున్నది. వారింకా విప్లవంనుంచి పూర్తిగా బయట పడలేదేమోనని కనిపించుతున్నది" అని ఆయన అన్నారు.

"రష్యా బీదదేశమేమీ కాదు. భాగ్యవంతమయిన దేశం. కాని చైనామాత్రం బీదదేశం" అని శ్రీ నెహ్రూ అన్నారు.

భారతదేశపు తటస్థవిధానం, ప్రపంచంలో దాని పాత్రను గురించి ప్రశ్నించగా, ప్రతిదేశపు విధానమూ ఆ దేశపుచరిత్ర, భూగోళంపై ఆధారపడి వుంటాయని, తటస్థ విధానం ప్రపంచ ఉద్రిక్తతను తగ్గించడంలో సహాయపడిందని, ఉద్రేకం, కటుత్వం లేకుండా మాట్లాడుకునేందుకు తోడ్పడిందని అన్నారు.

"ప్రపంచ సమస్యలకు శాంతియుత పరిష్కారం వుండాలి" అని ఆయన అన్నారు.

అయితే తటస్థ విధానం అంటే ఒకరికి లొంగిపోవడం కాదు.

రష్యాకువచ్చే క్యూబా పంచదార స్వాధీనం

అమెరికా చర్యకు రష్యా నిరసన

మాస్కో, సెప్టెంబరు 22

క్యూబానుండి సోవియట్ యూనియన్‌కు బ్రిటిష్ నౌకలో తీసుకొని రాబడుతున్న పంచదారను అక్రమంగా స్వాధీనపరచుకున్నందుకు అమెరికాకు రష్యా తీవ్ర నిరసనను తెలియచేసింది.

రష్యాపత్రాన్ని ఉప విదేశాంగ మంత్రి స్బెలాపిన్ అమెరికా రాయబారికి అందజేశారు. కొన్ని రిపేర్ల నిమిత్తం బ్రిటిష్ నౌక పోర్టోరికా రేవుకుపోగా అక్కడి కోర్టు అధికారులు అందులో వున్న 7,130 టన్నుల పంచదారను స్వాధీనం చేసుకున్నారని ఆ పత్రంలో వున్నది.

పంచదార సోవియట్ విదేశీవ్యాపార సంస్థకుచెందినది. పోర్టోరికో చర్య పూర్తిగా చట్టరాహిత్యమని సోవియట్ రష్యా అన్నది.

"పోర్టోరికాపై అమెరికాధికారం చెలాయిస్తుంది. పోర్టోరికా న్యాయాధికారులు చేసిన న్యాయవిగహిత చర్యలకు అమెరికా ప్రభుత్వం బాధ్యత వహించవలసి వుంటుంది" అని ఆ పత్రంలో వున్నది.

తమ పంచదారను తమ స్వాధీనం చేస్తూ, జరిగిననష్టాలకు పరిహారం ఇవ్వాలని, ఇకముందు ఇటువంటి చర్యలు జరగకుండా చూడాలని ఆ పత్రం కోరుతున్నది.

విశాఖపట్నం రేవు అభివృద్ధికి అవకాశం

మంత్రి వివరణ

హైద్రాబాద్, సెప్టెంబరు 22

ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణం హైవేస్ శాఖామంత్రి శ్రీ మీర్ అహమ్మద్ ఆలీఖాన్ నేడిక్కడ మాట్లాడుతూ, విశాఖరేవును మరింతగా అభివృద్ధిచేసే అవకాశం ఉందని అన్నారు. ఇంకా ఇలా అన్నారు:

"ఇటీవల విశాఖపట్నం రేవుకు యెంతో ప్రాధాన్యం హెచ్చింది. నూనె శుద్ధి కర్మాగారం అక్కడ నెలకొల్పటం, హుస్నీసది ఒండ్రు వేయడం వలన ఆ రేవునుండి కొంత రవాణాను యిక్కడకు మళ్ళించడం, మధ్యప్రదేశ్‌నుండి జపాన్‌కు ముడిఇనుము ఎగుమతి చేయడం ఈ కారణాలవల్ల విశాఖరేవు ప్రాముఖ్యత ఎక్కువైందన్నారు.

మధ్యప్రదేశ్‌లోని ముడి ఇనుము కేంద్రాన్ని విశాఖపట్నంతో కలిపే రైల్వేలైను నిర్మాణం చురుకుగా సాగుతుందన్నారు.

క్లోరిన్ సిలిండర్ పేలిపోలేదట!

రైల్వేశాఖ వివరణ

బొంబాయి, సెప్టెంబరు 22

నిన్న ఉజ్జయినిలో క్లోరిన్ సిలిండరు పేలిపోలేదని, మూతమాత్రమే ఊడిపోయిందని పశ్చిమ రైల్వేఅధికారులు నేడొక ప్రకటన చేశారు. బ్రేక్‌వేన్‌లో వున్న క్లోరిన్ సిలిండరు మూత వదులై వాయువు బైటికి వస్తూండగా కార్మికులచే గార్డు బైటికి తీయించాడు. ఈ సిలెండరును బైటికితీస్తున్న కార్మికులకు ఈ వాయువు సోకడంతో వారు దానిని క్రింద పడవేశారు. దీనితో సిలిండరు మూతవూడిపోయి దూరంగా పడింది. లోపలనున్న వాయువు బైటికి విస్తరించింది.

ఇంతవరకు 273 మందిని ఆస్పత్రి నుండి విడుదల చేశారు. ప్రాణభయం మాత్రం ఎవరికీ లేదని అధికారులు ప్రకటించారు.

క్యూబాకు సరుకులు చేసినదేశాలకుసహాయం కోతను ఉపసంహరించుకోవాలని రస్క్ విజ్ఞప్తి

వాషింగ్టన్, సెప్టెంబరు 22

క్యూబాకు నౌకల్లో ఏ రకమయిన సరుకులు మోసుకొనిపోయినా అమెరికా విదేశీ సహాయం ఇవ్వరాదన్న సవరణ బిల్లును ఉపసంహరించుకోవలసినదిగా ప్రభుత్వ కార్యదర్శి డీన్‌రస్క్ నిన్న విజ్ఞప్తి చేశారు.

"ఈ రకమయిన సవరణవలన మా పని మహా ఇరుకున పడుతుంది. మన సహచరులతో వ్యవహారించడం చాల కష్టమయిపోతుంది." అని ఆయన అన్నారు.

ఆంధ్రరేవుల అభివృద్ధి పట్ల అలక్ష్యభావం

రు. 144 లక్షలు కావలసి ఉండగా 45 లక్షలు కేటాయింపు: రాష్ట్రమంత్రి వివరణ

హైద్రాబాద్, సెప్టెంబరు 23

"తృతీయ ప్రణాళిక కాలంలో చిన్న రేవులకు దేశం మొత్తంమీద రు. 10 కోట్లు కేటాయించారు. ఆంధ్రదేశంలోని చిన్న రేవుల అభివృద్ధికి సుమారు రు. 1 కోటి 44 లక్షలు అవసరమై ఉండగా ఈ 10 కోట్లనుండి 45 లక్షలు మాత్రమే కేటాయించారు ఇది ఆంధ్రలోని చిన్న రేవుల అభివృద్ధికి ఎంతమాత్రం సరిపోదు" అని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణం హైవేస్ శాఖామంత్రి శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్ నేడిక్కడ పత్రికా విలేకరులతో అన్నారు.

తృతీయ ప్రణాళికలో రాష్ట్రం చిన్న రేవులకిచ్చిన రు. 45 లక్షలలో కాకినాడకు రు. 25 లక్షలు, బందరుకు రు. 15 లక్షలు, కృష్ణపట్నానికి రు. 5 లక్షలు యివ్వబడినవి, ఇంకా ఆంధ్రాలోని అనేక చిన్న రేవులను అభివృద్ధి చేయడానికి ఈ మొత్తం ఎంతమాత్రం సరిపోదనీ అన్నారు. ఇంకా ఇలా అన్నారు:

వాడరేవు అభివృద్ధి

వాడరేవును అభివృద్ధి చేయాలని గుంటూరుజిల్లా ప్రజలు పొగాకు ఉత్పత్తిదారులు పదేపదే కోరుతున్నారు. వాడరేవు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈ రేవును గనుక ప్రభుత్వం అభివృద్ధి చేసి వాస్సాను కట్టినట్లయితే తాము 30 లక్షల రూపాయలు అప్పుగా యిస్తామని అన్నారు.

ఈ విషయాన్ని రాష్ట్రం చిన్న రేవుల అభివృద్ధి కమిటీ వచ్చే సమావేశంలో చర్చించనున్నామనిఅన్నారు. కమిటీ సమావేశం డిసెంబరులో జరగవచ్చునని అన్నారు.

ఏలేటి వరదలకు గొల్లప్రోలులోని 2000 ఎ॥ మునక

పిఠాపురం, సెప్టెంబరు 20

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం తాలూకా యేలేరుకోండ కాలవ వరదలకు గొల్లప్రోలు గ్రామంలో రెండు వేల యకరాలు నీట మునిగిపోయినవి. ఇప్పటికి నాల్గురోజులనుండి నీరు తగ్గలేదు. గొల్లప్రోలు గ్రామంలో 1వ వార్డు, 4వ వార్డు, 6వ వార్డు, 12వ వార్డులలో నాల్గుఅడుగుల లోతు నీరు ప్రవహించుటమూలంగా ప్రజలు నిలుచుటకు తావులేకపోయింది. వరిపొలములలో నీరు ఆరు అడుగులు లోతుగనుక వుండి యిప్పటికి నాల్గు రోజులనుండి తగ్గలేదు. పొలములలోను వరి పైగా కుళ్ళిపోవునని రైతాంగము భయభ్రాంతులు అగుచున్నారు.

రుమేనియా అధ్యక్ష ప్రధాన మంత్రులు

అక్టోబరులో భారతదేశం రాక

విచుత్నాం, సెప్టెంబరు 22

రుమేనియా అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కార్యదర్శి అయిన జియోర్జి జియోర్జియుదేజ్, ప్రధాన మంత్రి జియోర్జి మూరర్‌లు వచ్చే నెలలో భారతదేశానికి అధికార పర్యటనకు వస్తారని బుకారెస్టు రేడియో నేడు ప్రకటన చేసింది.

అక్టోబరు నెల మొదట్లో వారిక్కడికి వస్తారు.

ఉత్తర బర్మాలో ఘర్షణ

10 మంది మరణం

రంగూన్, సెప్టెంబరు 22

గత వారం నాటి ఉదయం ఉత్తర బర్మాలో లాషియోవద్ద కాఛిన్ తిరుగుబాటు దార్లకు, ప్రభుత్వ బలగాలకు మధ్య జరిగిన దెబ్బలాటలో పదిమంది మరణించారని నేడిక్కడకు అందిన వార్తలనుబట్టి తెలుస్తున్నది

తిరుగుబాటుదార్లకు ప్రభుత్వ దళాలు తీవ్ర నష్టాలు కలగజేసి పారద్రోలారు. వారిలో ఎంతమంది మరణించిందీ యింకా తెలియడంలేదు.

కాంగోలో ఐరాస విమాన ప్రమాదంలో మరొకరి మృతి

స్టాక్‌హోం, సెప్టెంబరు 22

కాంగోలో నేలకూలిన ఐరాస విమానంలోని క్షతగాత్రులలో మరొకరు నేడు ఆస్పత్రిలో మరణించినట్లు స్వీడిష్ రక్షణశాఖ ప్రకటించింది. భూమిమీద నుండి విమానంపైన వారు కాల్పులు కాల్చినందునే ఈ ప్రమాదము జరిగినట్లు తెలుస్తున్నది.

తూర్పు గోదావరిజిల్లా బాడ్‌మింటన్ పోటీలు

కాకినాడ, సెప్టెంబరు 20

నేషనల్ రిక్రియేషన్ క్లబ్ వారు నిర్వహించుచున్న తూర్పు గోదావరి జిల్లా బాల్ బాడ్‌మింటన్ ఎసోసియేషన్ సెలక్షన్ పోటీలు యీ రోజు ఉదయం నుంచి ఇక్కడ ప్రారంభమైనవి.

కరాచీ విద్యార్థి నాయకులపై మరికొన్ని ఆంక్షలు

కరాచీ, సెప్టెంబరు 22

కరాచీ రాకూడదని నిషేధించబడ్డ 12 మంది విద్యార్థులలో 7 గురు కొద్ది రోజులుగా లాహోర్‌లో వుంటే, అక్కడనుండి కూడా వెడలిపొమ్మని పశ్చిమ పాకిస్తాన్ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

పశ్చిమ పాకిస్తాన్ గవర్నరు చేసిన ఉత్తర్వులో వారు రావల్పిండి, హైదరాబాద్ (సింధు), పెషావర్లకు కూడా వెళ్ళరాదు. క్వెట్టా - పిషిన్ జిల్లాలోకి పై 12 మందిలో ఎవరూ రావటానికి వీలులేదని మేజిస్ట్రేటు ఉత్తర్వు జారీచేశారు.

'మా కృషికి సంఘ బలం కూడా తోడు కావాలి'

బాపట్ల ప్రాంత ఉపాధ్యాయుల సన్మాన సభలో శ్రీ లక్ష్మయ్య, శ్రీ శ్రీరామమూర్తిగార్ల ప్రబోధం

బాపట్ల, సెప్టెంబరు 22

"మేము చేసే కృషికి అండగా దేశంలోని ఉపాధ్యాయులంతా సుసంఘటితమై తమ సంఘాలను పటిష్టం చేసుకొని శక్తివంతంగా ఉద్యమం నడిపిన రోజుననే ఉపాధ్యాయులందరి అపరిష్కృత సమస్యలు నెరవేరుతాయి" అని శాసన మండలికి ఇటీవల ఉపాధ్యాయ ప్రతినిధులుగా ఎన్నికైన శ్రీయుతులు చెన్నుపాటి లక్ష్మయ్య, శ్రీ పి. శ్రీరామమూర్తిగార్లు తమ గౌరవార్థం యిక్కడ జరిగిన సన్మానసభలో వక్కాణించారు.

శ్రీ లక్ష్మయ్య, శ్రీ శ్రీరామమూర్తి గార్లను సన్మానించుటకు బాపట్ల పట్టణ,పరిసర ప్రాంత కాలేజీ, ట్రైనింగ్, ఉన్నత, హయ్యర్ సెకండరీ, మాధ్యమిక, ప్రాథమిక హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలల ఉపాధ్యాయులచే యీ నెల 15వ తేదీన ఈ సన్మానసభ కనకదుర్గా టాకీస్‌లో ఏర్పాటు చేయబడింది సభకు సుమారు 400 మంది ఉపాధ్యాయులు హాజరైనారు ఈ సందర్భంగా సన్మాన సంఘమువారు ఉపాధ్యాయ సంఘానికి రు 116 ల నిధిని సమర్పించారు.

సభకు ఏ. టి. కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ యస్. రాధాకృష్ణన్ గారు అధ్యక్షత వహించారు.

ఈ సన్మానసభలో శాసనమండలి సభ్యులు శ్రీ సింగరాజు రామకృష్ణయ్య, గుంటూరు జిల్లా టీచరు గిల్డు కార్యదర్శి శ్రీ వై. బాపయ్యగార్లు పాల్గొన్నారు.

సన్మానసంఘ కార్యదర్శి శ్రీ కత్తుల వెంకటేశ్వర్లుగారు అతిథులను పరిచయం చేయగా సన్మాన సంఘాధ్యక్షులు శ్రీ ఉప్పల లక్ష్మీనారాయణగారు సన్మాన పత్రం సమర్పించారు.

తరువాత జిల్లా టీచరు గిల్డు కార్యదర్శి శ్రీ వై బాపయ్యగారు ఉపన్యసిస్తూ, మన శాసనమండలి ప్రతినిధులు అక్కడ శక్తివంతంగా లేకుండా కృషి సల్పుతూ వున్నారనీ, కానీ మన సమస్యలు మన ప్రతినిధుల ప్రసంగాలవలన, శాసనమండలి సభ్యత్వాల వలన మాత్రమే నెరవేరవనీ, శాసనమండలిలో వారి కృషికి చేయూతగా మనమంతా సమైక్యంగా చైతన్యంతో, సంఘాలలో సభ్యులుగా చేరవలసివుందని ఉద్బోధించారు.

శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారు మాట్లాడుతూ, ఓట్లివ్వడమేగా, ఆర్థికంగా ఆదుకొని, తీవ్రంగా శ్రమించి, తమ విజయానికి అన్నివిధాలా కృషి సల్పిన ఉపాధ్యాయులకు, కార్యకర్తలకు ధన్యవాదాలర్పించారు. గతానుభవం బట్టిచూచినా మనం శక్తివంతంగా పోరాటాలు, ఆందోళనలూ సాగించినందు చేకొన్ని సమస్యలను నెరవేర్చుకోగలగామనీ ఇంకెన్నో సమస్యలు మిగిలివున్నవనీ, సంఘాలను దృఢతరంచేస్తే, తాము, ఆ సంఘాలు కలసి పనిచేస్తామని అన్నారు. తర్వాత శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు ఉపన్యసించారు

శ్రీ శ్రీరామమూర్తిగారు ఉపాధ్యాయులు సమర్పించిన మెమోరాండములకు సమాధానాలందజేశారు.

జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ ఉపాధ్యక్షులు శ్రీ రామలింగయ్యగారు ఉద్యమావశ్యకతను వివరించారు.

శ్రీ లక్ష్మీనారాయణగారి వందన సమర్పణతో సభ సమాప్తమైంది.

ఎన్. జి. వో.ల విందు

బాపట్ల, సెప్టెంబరు 17

శాసనమండలిలో ఉపాధ్యాయ ప్రతినిధులు శ్రీయుతులు చెన్నుపాటి లక్ష్మయ్య, పి. శ్రీరామమూర్తి, సింగరాజు రామకృష్ణయ్యగార్లు యీ నెల 15వ తేదీన బాపట్ల విచ్చేసిన సందర్భంలో బాపట్లతాలూకా ఎన్. జి వో.ల సంఘంవారు, వారి గౌరవార్థం తేనేటివిందు జరిపారు.

విందుకు తాలూకా ఎన్. జి. వో.ల సంఘ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు హాజరైనారు.

తాలూకా సంఘ ఆర్గనైజర్ శ్రీ భాషాగారు అతిథులను పరిచయం చేశారు. (వి. వి.)

లారీ డ్రైవరుకు ఆరునెలలు శిక్ష

బందరు రోడ్డులో జరిగిన ప్రమాదం సందర్భంలో

విజయవాడ, సెప్టెంబరు 22

విజయవాడ బందరు రోడ్డులో బెంజి కంపెనీవద్ద గత మే 29 వ తేదీన లారీని నిర్లక్ష్యంగాను, వేగంగాను నడిపి బావిశెట్టి రత్నమ్మ అను ఆమె మరణానికి కారకుడైనందున, లారీ డ్రైవరు బండి పుల్లయ్యకు విజయవాడ అడిషనల్ జిల్లా మునిసిఫ్ మెజిస్ట్రేట్ శ్రీ బి. సత్యనారాయణగారు ఈ నెల 21వ తేదీన 6 నెలలు కఠినశిక్ష విధించారు. డ్రైవరు లైసెన్సు రద్దు చేయడానికి తగు చర్యలుకూడా తీసుకుంటున్నారు.

శ్రీ నెహ్రూ నైగీరియా పయనం

పారిస్, సెప్టెంబరు 22

ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ నేటి రాత్రి 12 గంటలకు పారిస్ నుండి లాగోసు బయలుదేరారు. లాగోస్ నైగీరియాలో వున్నది. ఆయన రోమ్ మీదుగా నైగీరియా వెళ్ళుతారు.

వర్షాలవలన పంజాబులో 12 మంది మరణం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

పంజాబులో భారీ వర్షాలు, వరదల వలన ఇండ్లు కూలి అమృతసర్ - అంబాలా పట్టణాలలో మొత్తం 12 మంది ఈమధ్య మరణించారు. అనేక మంది గాయపడ్డారు.

ఎనిమిదిమంది అమృతసర్‌లో మరణించారు. నలుగురు అంబాలాలో మృతినొందారు.

ఫుట్‌బాల్ పోటీలో బెంగాల్ గెల్పు

కలకత్తా, సెప్టెంబరు 22

ఇక్కడ జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీలలో బెంగాల్‌కు చెందిన మోహన్ బాగన్ జట్టు, హైద్రాబాద్ జట్టుపై 3-1 గోలులలో గెల్పొందింది. ఈ అఖిల భారత ఫుట్‌బాల్ పోటీలలో (ఐ. ఎఫ్. ఎ) మోహన్ బాగన్ జట్టు గెల్వడం ఇది ఎనిమిదవసారి.

అక్టోబర్‌లో గవర్నర్ల సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22

రాష్ట్ర గవర్నర్ల వార్షిక సమావేశం అక్టోబరు 23 - 24 తేదీలలో న్యూఢిల్లీలో జరుగుతుంది. సమావేశంలో దేశంలోని రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రులు సమీక్షించుతూ ఉపన్యాసాలుంటాయి.

నెహ్రూ-డిగోల్ భేటి

పారిస్, సెప్టెంబరు 22

భారత ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ నేడు ఫ్రెంచి అధ్యక్షుడయిన డిగోల్‌ను తమ ఎలెసే రాజభవనంలో కలుసుకున్నారు. శ్రీ నెహ్రూ అధ్యక్షుడు డీగోల్‌తో 45 నిమిషాలసేపు సంభాషించారు. వారు నేడొక విందులో కలసి ఆరగిస్తారు.

బ్యూనోస్ఎయిర్స్‌పై బాంబులు

బ్యూనోస్ ఐర్స్, సెప్టెంబరు 22

అర్జెంటైనాలో బ్యూనోస్ ఎయిర్స్ పట్టణం మీద విమానాల నుండి నేడు బాంబులు వేయబడ్డాయి.

పరుచూరు సమితి కో-ఆప్షన్‌లు

కమ్యూనిస్టు - కాంగ్రెసు ఫ్రంటు గెలుపు

పరుచూరు, సెప్టెంబరు 20

గుంటూరుజిల్లా పరుచూరు పంచాయతీ సమితికి ఈరోజున సమితి ఆఫీసులో కో-ఆప్షన్‌లు జరిగినవి. మొత్తం 36 పంచాయతీల అధ్యక్షులు ఈ ఎన్నికలలో పాల్గొన్నారు. ఎన్నికలను సబ్ కలెక్టరు నిర్వహించారు.

కాంగ్రెసు - కమ్యూనిస్టు పార్టీలు ఫ్రంటుగా ఏర్పడి పోటీచేశాయి. స్వతంత్రపార్టీవారు, ఆరు స్థానాలకు పోటీచేసి అన్నీ కోల్పోయారు.

ఎన్నుకోబడిన సభ్యుల పేర్లు: శ్రీమతి ఉప్పుటూరి అనసూయ (కమ్యూ), శ్రీమతి బొగ్గవరపు కోటేశ్వరమ్మ (కాం), శ్రీ కాకి వెంకటరత్నం (హరిజన-కమ్యూ), శ్రీ పులిపాటి సాహెబు (హరిజన - కాం) శ్రీ యార్లగడ్డ తిరుపతి రాయుడు (జనరల్ - కాం) శ్రీ యత్రం వెంటప్పారెడ్డి (కో-ఆ. సొసైటీల ప్రతినిధి కాం).

సమితి అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఈ నెల 29 వ తేదీన ఎన్నికలు జరుగనున్నవి. (వి వి.)

కనగపాడు పంచాయతీ

కనగపాడు, సెప్టెంబరు 19

కృష్ణాజిల్లా నందిగామబ్లాక్ కనగపాడు గ్రామపంచాయతీకిఅధ్యక్షులుగా శ్రీ కర్నాటి సూర్యనారాయణగారు ఎన్నుకోబడ్డారు. ఈ పంచాయతీ అధ్యక్షుని ఎన్నిక గత మూడుసంవత్సరములనుండి దావాలో వున్నది. మండల కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కరివేద వీరభద్రయ్యగారు పోటీచేసి ఓడిపోయారు. (వి. వి.)

ఈ వారం ధరల సమీక్ష

(21-9-62తో అంతమయ్యేవారం)

అనగా 100 కిలో గ్రాములు లేదా 220½ పౌన్లు)

మిల్లు బియ్యం: మొదటి రకం చిత్తూరులో సంబర్లు రకం రు. 1.59 పెరిగినది. రెండవరకం: గుంటూరులో కుసుమ రు. 1.00 తాడేపల్లిగూడెంలో అక్కుళ్ళు రు. 2.70 తగ్గినది.

సార; మొదటిరకం: ఆముదాలవలసలో రు. 3.00తగ్గినవి. రెండవరకం: విజయనగరంలో రు. 1.34 ఆముదాలవలసలో రు. 2.65 తగ్గినవి. మూడవ రకం: విజయనగరంలో రు. 2.66 ఆముదాలవలసలో 2.32 తగ్గినది.

వేరుశెనగ: కాయలు: విజయనగరంలో రు 2.81, తెనాలిలో రు 3.00 తగ్గినది. పప్పు: ఆదోనిలో రు 1.00 పెరిగినది. నంద్యాలలో రు 1.25, అనంతపురంలో రు 1.15 కు తగ్గినది. నూనె: ఆదోనిలో రు 4.30 పెరిగినది. గుంటూరులో రు 1, అనంతపురంలో రు 2 20, తెనాలిలో రు 2, విశాఖపట్నంలో రు 1.66 తగ్గినది.

అపరాలు: కందులు: ఆముదాలవలసలో రు 1.62 పెరిగినది. విజయవాడలో రు 1, గుంటూరులో రు 1 తగ్గినది. మినుములు: విజయవాడలో రు 1. గుంటూరులో రు 3, ఆముదాలవలసలో రు 1.07 పెరిగినది. రాజమండ్రిలో రు 1 తగ్గినది. పెసలు: విజయవాడలో రు 1, విజయనగరంలో రు 3.22, పార్వతీపురంలో రు 1.10 పెరిగినది. గుంటూరులో రు 1, రాజమండ్రిలో రు 2 లు తగ్గినవి. శెనగలు: గుంటూరులో రు 3 81, ఆముదాలవలసలో రు 1.08, పార్వతీపురంలో రు 1.29 పెరిగినది. రాజమండ్రిలో రు 2 లు, విశాఖపట్నంలో రు 1.11 తగ్గినది.

జీడిపప్పు: అమెరికన్ రాజోలులో రు 1-37 తగ్గినది. ఇండియన్ వేటపాలెంలో రు 4-55 పెరిగినది. రాజోలులో 1-87 తగ్గినది. ముక్కలు రాజోలులో రు 1-81 తగ్గినది.

పసుపు: కొమ్ములు దుగ్గిరాలలో రు 2-25 కడపలో 2-0-0 తగ్గింది. దుంపలు దుగ్గిరాలలో 5-20 కడపలో రు 3-0-0 తగ్గినది. కామ్మావు దుగ్గిరాలలో రు 3-56 తగ్గినది.

ఉల్లిపాయలు: బళ్ళారి: తాడేపల్లిగూడెంలో రు 2-0-0 పెరిగినది.

జొన్నలు: పచ్చవి అనంతపురంలో రు 2-00 తగ్గినది.

మిర్చి: దేశావళి గుంటూరులో రు 5-0-0 లు తగ్గినది. చెర్లరకం గుంటూరులో 5-0-0 పెరిగినది.

కొబ్బరికాయలు - కొత్తవి: రాజమండ్రిలో రు 5-00 తగ్గినవి. విజయవాడలో రు 10-00 పెరిగినవి.

పాతవి: విజయవాడలో రు 14-00 పెరిగినది.

చిక్కవోలు మార్కెట్టు ధరలు:

	ధాన్యం	బియ్యం
మొదటి రకం	59-00	61-25
రెండవ రకం	57-66	66-25

జంగారెడ్డిగూడెం మార్కెట్టుధరలు

పుగాకు రు 356-00. రు 1-00 పెరిగినది. ఉలవలు రు 42-00, చింతపండు రు 69-00, కుంకుళ్ళు రు 70-00 1-00 పెరిగినది.

1. ఏలూరు మార్కెట్టుకు క్రిందటి వారపు నిల్వలు ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 7771 క్వింటాల్సు బియ్యంలో 5630 క్వింటాల్సు ఖర్చు కాగా 2141 క్వింటాల్సు మిగిలియున్నవి.

2. కాకినాడ మార్కెట్టుకు క్రిందటి వారపు నిల్వలు, ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 12,916 క్వింటాల్సు బియ్యంలో 5131 క్వింటాల్సు ఖర్చు కాగా 7815 క్వింటాల్సు మిగిలియున్నవి.

3. విశాఖపట్నం మార్కెట్టుకు క్రిందటివారపు నిల్వలు, ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 27 క్వింటాల్సు మినుములు 33 క్వింటాల్సు పెసలు, 57 క్వింటాల్సు శెనగలలో 18 క్వింటాల్సు మినుములు, 20 క్వింటాల్సు పెసలు, 30 క్వింటాల్సు శెనగలు ఖర్చుకాగా 9 క్వింటాల్సు మినుములు, 12 క్వింటాల్సు పెసలు 29 క్వింటాల్సు శెనగలు, మిగిలినవి.

4. జంగారెడ్డిగూడెం మార్కెట్టు క్రిందటి వారపు నిల్వలు, ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 5790 క్వింటాల్సు పుగాకు 170 క్వింటాల్సు ఉలవలు 130 క్వింటాల్సు చింతపండు 103 క్వింటాల్సు కుంకుళ్ళు 200 క్వింటాల్సు పుగాకు 100 క్వింటాల్సు ఉలవలు 70 క్వింటాల్సు చింతపండు 50 క్వింటాల్సు కుంకుళ్లు ఖర్చుకాగా 5690 క్వింటాల్సు పుగాకు 70 క్వింటాల్సు ఉలవలు, 60 క్వింటాల్సు చింతపండు 53 క్వింటాల్సు కుంకుళ్ళు మిగిలియున్నవి.

5. విజయనగరం మార్కెట్టు క్రిందటి వారపు నిల్వలు, ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 200 క్వింటాల్సు మినుములు, 4.64 క్వింటాల్సు పెసలు, 250 క్వింటాల్సు శెనగలు, 4500 క్వింటాల్సు సార 2వ రకం 650 క్వింటాల్సు వేరుశెనగపప్పులో 200 క్వింటాల్సు మినుములు, 200 క్వింటాల్సు పెసలు, 210 క్వింటాల్సు శెనగలు, 2600 క్వింటాల్సు సార రెండవరకం, 530 క్వింటాల్సు వేరుశెనగపప్పు, ఖర్చు కాగా 264 క్వింటాల్సు పెసలు, 40 క్వింటాల్సు శెనగలు, 1900 క్వింటాల్సు సార 2వ రకం, 120 క్వింటాల్సు వేరుశెనగపప్పు మిగిలియున్నవి.

6. రాజమండి మార్కెట్టుకు క్రిందటి వారపు నిల్వలు, ఈ వారపు దిగుమతులలో సహా ఉన్న 80 క్వింటాల్సు కందులు, 265 క్వింటాల్సు మినుములు, 72 క్వింటాల్సు పెసలు, 273 క్వింటాల్సు శెనగలులో 5 క్వింటాల్సు కందులులో 30 క్వింటాల్సు మినుములు, 4 క్వింటాల్సు పెసలు, 35 క్వింటాల్సు శెనగలు ఖర్చుకాగా 75 క్వింటాల్సు కందులు, 4 క్వింటాల్సు పెసలు, 35 క్వింటాల్సు శెనగలు ఖర్చుకాగా 75 క్వింటాల్సు కందులు, 235 క్వింటాల్సు మినుములు, 68 క్వింటాల్సు పెసలు, 237 క్వింటాల్సు శెనగలు మిగిలియున్నవి.

7. గుంటూరు మార్కెట్టుకు క్రిందటివారపు నిల్వలు ఈ వారపు దిగుమతులలో సహా కలసిఉన్న 7720 క్వింటాల్సు బియ్యం,4825 క్వింటాల్సు అపరాలు, 840 క్వింటాల్సు మిర్చి, 62 క్వింటాల్సు వేరుశెనగపప్పు, 420 క్వింటాల్సు నెయ్యిలో, 2680 క్వింటాల్సు బియ్యం, 975 క్వింటాల్సు అపరాలు, 210 క్వింటాల్సు మిర్చి, 62 క్వింటాల్సు వేరుశెనగపప్పు, 200 క్వింటాల్సు నెయ్యి ఖర్చుకాగా 504 క్వింటాల్సు బియ్యం,3850 క్వింటాల్సు అపరాలు, 630 క్వింటాల్సు మిర్చి, 220 క్వింటాల్సు నెయ్యి మిగిలియున్నవి.

8. విజయవాడ మార్కెట్టు క్రిందటి వారపు నిల్వలు, ఈ వారపు దిగుమతులతో సహా ఉన్న 12,600 క్వింటాల్సు బియ్యం, 7755 క్వింటాల్సు అపరాలలో 9200 క్వింటాల్సు బియ్యం, 2130 క్వింటాల్సు అపరాలు ఖర్చు కాగా 3400 క్వింటాల్సు బియ్యం, 5625 క్వింటాల్సు అపరాలు మిగిలియున్నవి.

అనారోగ్య కారణాలవలన మద్రాసులో ఉన్న బొంబాయి గవర్నర్ సుబ్బరాయన్ మరికొన్ని రోజులు మద్రాసులోనే ఉండదలచుకొన్నారు.

కొల్లేరుప్రాంతంనుండి వరద బాధితుల వలస

నీరు తగ్గడానికి కనీసం నెల అయినా పడుతుందని రైతుల అభిప్రాయం

(విశాలాంధ్ర విలేకరి)

ఏలూరు, సెప్టెంబరు 22

కొల్లేరువరద తగుముఖం పట్టడానికి బదులు రోజురోజుకు విపరీతంగా పెరగడంతో లంక గ్రామాల్లోని ప్రజలు చేతికందిన సామానులు తీసుకొని; పసిబిడ్డలను చంకన వేసుకొని బారులుతీరి మెరక ప్రాంతాలకు వలసపోతున్నారు.

కొంతమంది ప్రాణభయంతో పశువుల్ని అక్కడే వదలి వెళుతున్నట్లు తెలియవస్తూంది. గత 5,6 రోజుల నుంచి నీటిలో నానడంచేత కొందరికి కాళ్ళు తెల్లబడి బలిజ్వరాలతో బాధపడుతున్నారు.

శాసనసభ్యులు శ్రీ అత్తులూరి సర్వేశ్వరరావు, పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి విమలాదేవి వ్యవసాయ కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ కోండ్రు సుబ్బారావు గత మూడు దినాలు కొల్లేరు లంక గ్రామాలలో పర్యటించారు. ప్రమాదభరితమైన పడవ ప్రయాణాలు జేసి అన్ని గ్రామాలు తిరిగారు. ప్రజలను పరామర్శించి, వివరాలు సేకరించి, రెవెన్యూ అధికారులకు అందజేశారు.

వీరితోపాటు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీ జి. వెంకటేశ్వర్లు, ఏలూరు తహశీల్దార్ శ్రీ అడ్డాల మాధవరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు లంక గ్రామాల కరణాలు, విధి విరామం లేకుండా వరద బాధితులను కలుసుకొని, తక్షణ సహాయం అందజేయడానికై కృషి సల్పుతున్నారు.

వీరితోపాటు జిల్లా అసిస్టెంట్ హెల్తు ఆఫీసర్, వారి సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ వాదులు శ్రీ మోతె వెంకటనారాయణ, శ్రీ ఎస్. సత్యనారాయణ, శ్రీ పి. అప్పలస్వామిగార్లు కూడా పర్యటనలో పాల్గొన్నారు.

ఈ వరద తాకిడికి 50 వేల ఎకరాలు పంటభూములు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేసినట్లు తెలుస్తుంది.

ప్రత్తికోళ్ళలంక, గుడివాకలంక, చెట్టున్నపాడు గ్రామాల ప్రజలు స్త్రీలు వృద్ధులతో సహా, తట్టా తపేలా నెత్తిన పెట్టుకొని ఏలూరుకు సమీప గ్రామమైన చేటపర్రు గ్రామం దగ్గర 'విశాలాంధ్ర' విలేకరికి ఎదురయ్యారు. వారిని ప్రశ్నించగా తాము మెరక ప్రాంతాలకు వెళుతున్నట్లు, ప్రయాణ చార్జీలైనా చేతిలో లేనట్లు తెలియజేశారు. గొల్లవానికుంట దగ్గర రోడ్డుమీద 1½ అడుగుల నీరు వుంది. కూలిపోయిన ఇండ్లు, నీటిమీద తేలాడుతున్న గడ్డివాములు, మేతలేక మెడలు పైకెత్తి నిలిచిన పశువులు, తిండిలేక ఎటూ వెళ్ళడానికి దారిలేక నిరాశ్రయులైన ప్రజల అగచాట్లు చెప్పనలవిగావు. అధికారులనుంచి అనధికారులనుంచి అందిన భోగట్టా ప్రకారం కొక్కిరాల లంకలో 100 ఇండ్లు, వడిచింతలపాడులో 201 యిండ్లు, మల్లవరంలో 45, చెట్టున్నపాడులో 300 యిండ్లుపూర్తిగా నీటమునిగి శిథిలమైనాయి. ఆగడాలలంకలో 400 ఇండ్లు కాళీజేసి వెళ్ళిపోయారు. ఇవిగాక కొలకలూరులో 10 ఇండ్లు, మహేశ్వరపురంలో 80, శ్రీపర్రులో 40, మాండ్రుపాడులో 70, అనంతపాడులో 4 ఇండ్లు శిథిలమైనాయి. కొన్ని కొన్ని చోట్ల 10 అడుగులు లోతు నీరు ప్రవహించుతూ వుంది. రోజు రోజుకు ½ అడుగు చొప్పున వరద పెరుగుతున్నదని, ఈ వరద తగ్గుముఖంపట్టి పూర్తిగా నీరు తీయడానికి కనీసం నెలరోజులైనా పడుతుందని రైతులు అంటున్నారు.

వరద బాధితులకు తక్షణ సహాయం చేయవలసిందిగా శ్రీ అత్తులూరి సర్వేశ్వరరావు, శ్రీమతి వీరమాచనేని విమలాదేవిగార్లు ముఖ్యమంత్రికి, రెవిన్యూమంత్రికి, ప్రధాన మంత్రికి టెలిగ్రాములు పంపారు. ఏలూరు తహసీల్దార్ వరద బాధితులకు వెనువెంటనే సహాయం అందచేయడానికై పడవల్లో బియ్యంతీసుకొనివెళ్లి పంచిపెట్టే కార్యక్రమం చేబట్టారు. పెదపాడు, భీమడోలు, దెందులూరు సమితుల నుంచి మొత్తం రు. 1200 విరాళంగా ఈ కార్యక్రమానికి వినియోగపరచనున్నారు.

స్థానిక శాసన సభ్యులు, ఉదారులైన ఏలూరుపట్టణంలోని రైస్ మిల్లర్లు, వ్యాపారులు ముందుకు వచ్చి వరద బాధితులకు తక్షణ సహాయం అందజేయవలసినదిగాను, ప్రభుత్వం సహాకరించాలని విజ్ఞప్తిజేశారు. (వి. వి.)

వెండితెర నవల సిద్ధంగా వుంది! వెల రు. 0-60 న.పై. కాపీలకు: చిత్రలేఖ గ్రంథమాల, 8 సింగారముదలి వీధి, మద్రాసు-17

యాజలి ఫిర్కా అంతా నేటికీ జలమయం

వరద ప్రాంతాలలో శాసన సభ్యుడు శ్రీ కొమ్మినేని వెంకటేశ్వరరావు పర్యటన

బాపట్ల, సెప్టెంబరు 22

ఇటీవలపడిన వర్షాల మూలంగా నక్కవాగు, తుంగభద్ర, తెనాలినుండి చందోలు ప్రక్కగా పారుతున్న మురుగు కాల్వల వరదలవలన గుంటూరు జిల్లాలోని యాజలిఫిర్కా మొత్తం యిప్పటికీ జలమయమై వుంది.

బాపట్ల బ్లాకు ప్రాంతంలో వరద దెబ్బతిన్న కర్లపాలెం, బుద్దాం, రెడ్డిపాలెం, సోడిపాలెం, చందోలు, సంగుపాలెం, కోడూరు, చుండూరుపల్లి, ఈతేరు, అప్పికట్ల మొదలైన గ్రామాల్లో బాపట్ల శాసనసభ్యులు శ్రీ కొమ్మినేని వెంకటేశ్వరరావుగారు పర్యటించారు. వీరివెంట బాపట్ల బ్లాకు కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ మెట్ల వెంకటసుబ్బారావు, బ్లాకు రైతుసంఘ ప్రతినిధి శ్రీ యార్లగడ్డ గోపాల మస్తాన్‌రావు, 'విశాలాంధ్ర' విలేకరి శ్రీ నూతలపాటి హనుమంతరావుగార్లు పాల్గొన్నారు.

ఈ పర్యటనానంతరం శ్రీ కొమ్మినేని వెంకటేశ్వరరావుగారు యిలా తెలియ జేస్తున్నారు.

"నక్కవాగు, తుంగభద్ర, తెనాలి, నుండి చందోలు ప్రక్కగా పారుతున్న మురుగు కాల్వల వరదల వల్ల యాజలి ఫిర్కా మొత్తం యిప్పటికీ జలమయమై వుంది. ముఖ్యంగా యాజలి, రెడ్డిపాలెం సోడిపాలెం, దుండిపాలెం, రామనగరం మొదలైన గ్రామాల పైర్లు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయినవి. చందోలు, కోడూరు, సంగుపాలెం, కోమలి, బుద్దాం, మొదలైన గ్రామాల పైర్లు 50 వంతుల వరకు పూర్తిగా నష్టపోయినవి. కోరేడుపల్లి, గుడిపూడి, భర్తిపూడి, అప్పికట్ల, కర్లపాలెం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలు నష్టపడినవి. ఈ మొత్తం నష్టపడిన భూములు 18 వేల ఎకరాల వరకూ ఉంటుందని అంచనా.

ఈ భూములు సుమారు 10 రోజుల నుండి నీటిలో మునిగివున్నవి. కొన్ని ప్రదేశాలలో యీరోజువరకూ పైర్లపై అర అడుగునుండి 1 అడుగువరకూ నీరు నిల్చేవుంది. ఈ వరద కొన్ని రోజుల్లో తగ్గినప్పటికీ ఆపైర్లు బ్రతికే ఆశమాత్రం లేదు. వ్యవసాయ ఖర్చులకు, ఎరువులకు యిప్పటికే ఎకరం 1కి రు. 150 రూపాయల నుండి రు. 200 వరకూ ఖర్చుపెట్టారు. బుద్దాంలో పేదలవి 40 యిళ్ళు, రెడ్డిపాలెంలో 30 పేదల యిళ్ళు, 10 పశువులసావిళ్లు పడిపోయినవి. ఇంకా కొన్ని గ్రామాలలో పెక్కు యిళ్ళు నీటమునిగి నివాసయోగ్యంగా లేవు. రెడ్డిపాలెం, సోడిపాలెం మొదలైన గ్రామాల్లో పశుగ్రాసం కూడా పూర్తిగాపోయి యిప్పటికీ నానా బాధలు పడుతున్నారు.

కనుక ప్రభుత్వం వెంటనే కదలి, పడిపోయిన పేదల యిళ్ళకు ఆర్థిక సహాయం అందించాలి. పై వరదలవల్ల నష్టపడిన భూములకు ప్రత్యేక కోటాల ద్వారా అదనంగా ఎరువులు సరఫరా చేయాలి. నీటమునిగి వున్నందువలన పైర్లకు వ్యాపించిన తెగుళ్ళ నివారణకు వ్యవసాయశాఖ ద్వారా మందులుఉచితంగా అందించాలి నీటమునిగిన గ్రామాలలో పశువులకు, ప్రజలకు, అంటు వ్యాధులు వ్యాపించు ప్రమాదాన్ని అరికట్టడానికి ఆరోగ్యశాఖవారు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

వరద బాధితులైన పేదప్రజానీకానికి చౌకధరలకు ఆహారపదార్థాలు అందించాలి.

శాశ్వత వరద నివారణకు సరైన పథకాలు అమలు జరుపడానికి ప్రభుత్వం, అధికార్లు తక్షణమే కదిలి పని చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను."

కొడవటికల్లు పంచాయతీ అధ్యక్షుని ఎన్నిక

కొడవటికల్లు, సెప్టెంబరు 20

కృష్ణాజిల్లా నందిగామబ్లాకు కొడవటికల్లు పంచాయతీకి, బ్లాకు యువజన సంఘ కన్వీనర్, బ్లాకు కమ్యూనిస్టు కమిటీ సభ్యులు అయిన శ్రీ వాశిరెడ్డి సాంబశివరావుగారు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. (వి.వి.)

గయ స్టేషన్‌లో తలకాయ, కాళ్ళూ లేని మొండెం

ప్యాసింజరు రైలుడబ్బాలో దొరికిన వైనం

గయ, సెప్టెంబరు 22

తలకాయ, కాళ్లులేని మొండెము, గయా స్టేషన్‌లో నిన్న కనుగొనబడినది. ఈ మొండెం పాట్నా-గయా ప్యాసింజరు రైలులో వచ్చిన ఒక ఉక్కు ట్రంకు పెట్టెలో వున్నది.

రైల్లోవున్న ప్రయాణీకులంతా దిగిపోయిన తరువాత ఒక రైల్వే పోలీసతను డబ్బాలోకి ఎక్కి చూస్తే ఆ పెట్టె కనపడింది. ఆ పెట్టె తమది అన్నవాళ్ళెవ్వరూ కనపడలేదు. దానిని స్టేషన్‌లోనికి తీసుకొనిపోయి పగులకొట్టి చూస్తే మొండెము కనపడింది.

మొండెము ఒక ముసలివానిదిగా కనపడుతున్నది. రక్తం మరకలుగల ఫోం, గుడ్డల్లో దాన్ని చుట్టి వుంచారు.

ఈ వార్తను అన్ని రాష్ట్రాల పోలీసులకు వెంటనే వైర్లెస్ ద్వారా తెలియచేశారు.

తూర్పు రైల్వేలో రెండు నెలల లోగా ఇటువంటి మొండాలు దొరకడం ఇది నాల్గవది. మొదటి మూడు హౌరా, దినాపూర్, గోమొ స్టేషన్లలో దొరికాయి.

కమ్యూనిస్టుపార్టీకి జాండ్రపేటవాసుల విరాళం

జాండ్రపేట, సెప్టెంబరు 20

గుంటూరు జిల్లా జాండ్రపేట నివాసులు శ్రీ బొడ్డు నాగయ్య, శ్రీ పృథ్వి వెంకటస్వామిగార్లు కమ్యూనిస్టుపార్టీకి తలొక రు 5 లు విరాళంగా యిచ్చారు.

దొంగ సారాతో అమెరికావౌరుని అరెస్టు

బొంబాయి, సెప్టెంబరు 23

బొంబాయిపట్టణం నుండి దొంగ సారా మోసుకుపోతున్న నేరానికి అమెరికా దేశీయుడైన ఛార్లస్ హెన్రీ అల్లెన్ అనే నావికుని గత రాత్రి పోలీసులు ఇక్కడ అరెస్టుచేశారు.


డాక్టర్‌గా నుండండి

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేటప్పుడు పోస్టల్ ట్యూషన్ ద్వారా హోమియోపతి చదువుకొని గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజీ ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము. వివరములకు వ్రాయండి.

INDIAN HOMOEOPATHIC COLLEGE
(VAV) JULLUNDUR CITY.

కోరింత దగ్గు అనే కక్కాయ దగ్గుకు

స్టాకువారి కొంగమార్కు మందు ప్రాణదాన మిచ్చును. పిల్లలకు వంత వించు కోరింత దగ్గుకు విరహాయకరమైన మందు. 8 అమావాస్యల పోవలయునది మీమారవద్దు. 8 రోజులలో తప్పక గుణమిచ్చును ఆంధ్రలో అన్ని మందులషాపులలో దొరకును.

జి.ఎస్. స్టియర్స్ & కో.,
మద్రాసు-1.

SPACE TWINS

The Story of Nikolayev and Popovich

The exciting story of this heavenly pair, who established a new breakthrough in man's tireless endevour to reach to the stars, is told here with simplicity and quiet pride.

BY
Y. Dokwchayev

Contains 20 Attractive Photos

PRICE: Rs. 2-00 Regd. Postage Extra: 0-75n.p.

Available at:

Visalaandhra Publishing House, Vijayawada-4
Visalaandhra Sales Depot, Besant Road, Vijayawada
People's Book House, Nehru Road, Hyderabad.

H.V. & L.V.
SWITCHBOARDS
MEI
ME-14



H. V. Metalclad Switchboard with air-insulated busbars.
H. V Switchboard. Type V. T. G. R.
H.V. Ring Main Control and Tee-off Fuse Switch Unit
H. V. Ring Main Control and Tee-off Fuse Switch Unit
H. V. Eleven-panel Switchboard.
L. V. Double Tier Switchboard.
L. V. Switchboard with H. R. C. Circuit Breakers.
L. V. Unit Type Switchboard.

Manufactured by:
THE MYSORE ELECTRICAL INDUSTRIES LTD.
P.O. Box 561, Bangalore 21.

Safest for everything in electric power control.

Sales & Service:
I.A.E.C.
(HYDERABAD) PVT. LTD.
Barman Buildings, Gunfoundry, Hyderabad.
Associated Offices at: BOMBAY . DELHI . CALCUTTA . MADRAS . BANGALORE

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు), కొత్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞాన సమితితరపున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కొత్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర అచ్చు ప్రెస్సు, విజయవాడ-4